


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 26 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 145 పేజీలు: 4 వెల: రూ 3-00


# 'పేదలకు మంచి చేసేందుకే ఈబీసీ నేస్తం'



అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,92,674 మంది అక్కచెల్లెమ్మలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఇందుకు 589 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఈ పథకం కోసం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. దేవుడి దయతో ఈరోజు మరో మంచి కార్యాక్రమానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తూ అడుగులు వేస్తున్నామని తెలిపారు.'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం ద్వారా అగ్రవర్ణ పేద మహిళలకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నామని పేర్కొన్నారు. అగ్రవర్ణాల్లో కూడా పేదవాళ్లు ఉన్నారు. వారికి మంచి జరగాలనే ఉద్దేశంతో ఈబీసీ నేస్తం పథకం తీసుకొచ్చినట్లు సీఎం వెల్లడించారు. ఈ పథకం ద్వారా రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, క్షత్రియ, వెలమ వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న పేద మహిళలకు ఆర్థిక సాయ చేకూరుతుందని చెప్పారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం మహిళల ఆర్థిక సాధికారిత, ఆత్మగౌరవాన్ని పెంచడానికి ఉపయోగపడుతుందని సీఎం జగన్ పేర్కొన్నారు.సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే. 'రిపబ్లిక్‌డేకు ఒకరోజు ముందు ఈ కార్యక్రమం చేస్తున్నాం. మన దేశాన్ని మన రాజ్యాంగం ప్రకారమే మనల్ని మనం పాలించుకునే రోజు ప్రారంభమైంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి రేపు 73వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. మన రాజ్యాంగ నిర్మాతలకు నిండు మనస్సుతో నివాళులు అర్పిస్తున్నాం. రాజ్యాంగం ఆశయాలను నెరవేరుస్తూ అడుగులు ముందుకేస్తున్నాం. రెండున్నరేళ్ల పరిపాలనలో ప్రతి అడుగూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకేస్తున్నాం. వైఎస్సార్ ఈబీసీ నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ఎన్నికలప్పుడు చెప్పిన వాగ్దానం కాదు. మేనిఫెస్టోలో కూడా చెప్పలేదు.

పేదవాడు ఎక్కడున్నా.. పేదవాడే. వారికి మంచి జరగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం. ఒక మంచి అన్నగా, తమ్ముడిగా.. వారికీ మంచి చేయాలనే బాధ్యత తీసుకుంటున్నాను. ఇప్పటికే వైఎస్సార్ చేయూత ద్వారా 45?60 ఏళ్ల మధ్యనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన దాదాపు 25లక్షల మందికి నాలుగేళ్లలో రూ.75వేలు ఇస్తున్నాం. ప్రఖ్యాత కంపెనీలతో కలిసి వారికి అండగా నిలబడే ప్రయత్నం చేశాం. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా కాపు, బలిజ, ఒంటరి మహిళలకు 3.27లక్షల మందికి ప్రతిఏటా రూ.15వేల చొప్పున ఐదేళ్లపాటు ఇస్తున్నాం. ఈబీసీ పథకం ద్వారా పేదరికంలో ఉన్న దాదాపు 4 లక్షలమందికి ప్రతిఏటా రూ.15వేలు ఇస్తాం. 32?33 లక్షల మంది మంది అక్కచెల్లెమ్మలు మేలు చేస్తున్నాం. అమ్మ ఒడి ద్వారా 45 లక్షల మందికి పైగా అక్కచెల్లెమ్మలకు మేలు. డ్వాక్రా మహిళలను గత ప్రభుత్వం మోసం చేసింది. దీనివల్ల సంఘాల పరపతి




దారుణంగా పడిపోయింది. ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాలను చెల్లిస్తున్నాం. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చాం. కోటి 25 లక్షల మందికి మేలు జరిగే గొప్ప కార్యక్రమం. రాష్ట్ర జనాభాలో నాలుగింట ఒక వంతు మందికి మేలు జరగుతోంది. ఇళ్ల నిర్మాణం కూడా చురుగ్గా సాగుతోంది. ఈ ఇళ్లన్నీ పూర్తయితే 32 లక్షల జీవితాల్లో వెలుగులు వస్తాయి. ప్రతి ఒక్కరికీ 5?10 లక్షల రూపాయల మేలు జరుగుతుంది. రూ.2 లక్షల పైచిలుకు ఆస్తిని అక్కచెల్లెమ్మలకు ఇచ్చినట్టు అవుతుంది. పొదుపు సంఘాల్లోని మహిళలకు సున్నావడ్డీ అమలు చేస్తున్నాం. జగనన్న విద్యాదీవెన ద్వారా పిల్లల చదువులకు అయ్యే ఫీజులను వారి ఖాతాల్లోనే వేస్తున్నాం. జగనన్న వసతి దీవెన కూడా ఇస్తున్నాం. సంపూర్ణ పోషణ ద్వారా 34 లక్షల మందికి పైగా మంచి చేస్తున్నాం. సంవత్సరానికి రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.మహిళా సాధికారితకు రాజకీయంగా కూడా పెద్ద ప్రాముఖ్యత ఇచ్చాం. శాసనమండలిలో తొలి మహిళా వైస్ ఛైర్మ న్‌గా సోదరిగా జకియా ఖాన్‌ఉంది. ఉప ముఖ్యమంత్రిగా పాముల పుష్ప శ్రీవాణి, మహిళా హోంమంత్రి సుచరితమ్మ ఉంది. రాష్ట్ర తొలి మహిళా చీఫ్ సెక్రటరీగా నీలం సాహ్నిని పెట్టాం. తొలి మహిళా ఎన్నికల అధికారిగా కూడా ఆమె ఉన్నారు. మన ప్రభుత్వంలో మనం వేసిన ముందడుగులు ఇవి. నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 51శాతం ఇచ్చాం. ఏకంగా చట్టమే తీసుకు వచ్చాం' అని సీఎం జగన్ చెప్పుకొచ్చారు.




# ఏపీలో మతతత్వ ప్రభుత్వం అధికారంలో ఉంది

## బీజేపీ చీఫ్ సోము వీర్రాజు సంచలన ఆరోపణలు

అమరావతి జనవరి 25 ఉద్యోగులకు మద్దతుగా దీక్ష చేపట్టిన ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు...జగన్ పై విమర్శలు గుప్పించారు.జగన్ ప్రతిపక్ష నేతగా రోడ్ల మీద తిరిగారని సీఎం అయిన తర్వాత జగన్ ప్యాలెస్లో కూర్చుని జనాన్ని రోడ్లెక్కిస్తున్నారని సోము ఎద్దేవా చేశారు.ఏపీలో మతతత్వ ప్రభుత్వం అధికారంలో ఉందని సంచలన ఆరోపణలు చేశారు. గుడివాడలో సంక్రాంతి సందర్భంగా తెలుగువారి సంబరాలను నాని చూడలేకపోయారని బీజేపీకి హిందూ ధర్మం కావాలని అన్నారు. బీజేపీకి కావాలిసింది ముగ్గులు గొబ్బెమ్మలు ధర్మం అని అన్నారు. మన ఆత్మ..భారత జాతి ఆత్మ అని జగన్ ఆత్మ ఏంటో చెప్పాలని నిలదీశారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని మండలాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తుందని చెప్పారు.గిద్దలూరు నుంచి గుంటూరుకు 4వేస్ రోడ్డు వేయాలని జనగ్ వినతి చేయగానే నితిన్ గడ్కరీ ఆమోదించారని ఏ రాష్ట్ర సీఎం అడిగినా ఆమోదిస్తారని అది బీజేపీ పాలన అని చెప్పారు. ఏపీలో రోడ్లు అధ్వాన్యంగా ఉన్నాయని వాటిపై తాము కూడా లెటర్ ఇస్తామని జగన్ కు దమ్ముంటే ధైర్యం ఉంటే రాష్ట్రంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు వేస్తారా అని ప్రశ్నించారు. ఏపీలో లిక్కర్ ను ప్రభుత్వం తయారు చేసి అమ్ముకుంటోందని మాతో పెట్టుకోవద్దని వార్నింగ్ ఇచ్చారు.జగన్ దగ్గర ఒక ముఠా చేరిందని ఆ ముఠానే సీఎంకు తప్పుడు సమాచారం ఇస్తోందని విమర్శించారు. కొందరు అధికారులు కూడా సీఎంను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు మట్టి ఇసుక అమ్ముకుంటున్నారని ఎమ్మెల్యేల బంధువులూ ఇందులో భాగస్వాములేనని ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం పెంచి అందరికీ మేలు చేయాలని ఈ విధంగా చేయడం సరికాదని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రూ. 50 వేల కోట్ల ఆదాయం తెస్తామని చెప్పారు.

# 'ఆ పార్టీకి బీటీమ్‌గా ఏపీ బీజేపీ పనిచేస్తోంది'

గుడివాడ: టీడీపీకి బీటీమ్‌గా ఏపీ బీజేపీ పనిచేస్తోందని మంత్రి కొడాలి నాని విమర్శించారు. వెన్నుపోటు, అబద్ధాలపై ఆధారపడ్డ వ్యక్తి చంద్రబాబు అని, అదే చంద్రబాబు అజెండాతో ఏపీ బీజేపీ పనిచేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల్లో బీజేపీ



డిపాజిట్లు తెచ్చుకుని చూపించాలని సవాల్ విసిరారు. మంగళవారం మీడియాతో కొడాలి నాని మాట్లాడుతూ.. 'చంద్రబాబు ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమే. చంద్రబాబు రాజకీయంగా పూర్తిగా దిగజారిపోయారు. డిపాజిట్ రాని బీజేపీ వాళ్ళు మా గురించి మాట్లాడితే ఎట్లా. ప్రజలను రెచ్చ గొట్టే కార్యక్రమాలకు పోలీసులు ఎందుకు అనుమతిస్తారు. నేను మాట్లాడిన దానికి ,బుద్ద వెంకన్న మాట్లాడిన దానికి చాలా తేడా ఉంది. చంద్రబాబు ఇంట్లో ఉండి మిగతా నేతలతో నన్ను తిట్టిస్తున్నారు. నా మీద 420 వ్యక్తులతో ఆరోపణలు చేయించారు' అని కొడాలి నాని ధ్వజమెత్తారు.

# 'ఇన్నాళ్లు ఉద్యోగులు అడగకుండానే అన్నీ చేశాం'




అమరావతి: పీఆర్సీ అంశానికి సంబంధించి మంత్రుల కమిటీతో జరిగిన ఉద్యోగ సంఘాల నేతల సమావేశం ముగిసింది ఈరోజు(మంగళవారం) సంప్రదింపుల కమిటీ వద్దకు ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ సభ్యులు వచ్చారు. దీనిలో భాగంగా ప్రభుత్వ నిర్ణయాలు, ప్రయోజనాలను మంత్రుల కమిటీ వివరించింది. జీతాలు తగ్గాయన్న అపోహలను మంత్రుల కమిటీ తొలగించే యత్నం చేసింది. ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల అపోహలు తొలగించే ప్రయత్నం చేశామన్నారు. ' 27వ తేదీన మరొకసారి చర్చలకు పిలిచాం. ఉద్యోగులు ప్రభుత్వం లో భాగమే. జీవోలను అబియన్స్‌లో పెట్టాలని వారు కోరారు. అవి తర్వాతైనా సవరించుకోవచ్చని చెప్పాం. మేం చెప్పిన విషయాలను వాళ్ల నాయకత్వంతో చర్చించి చెప్తామన్నారు. ఫిట్‌మెంట్‌కు సంబంధించి ఎలాంటి మార్పు ఉండదు. ఉద్యోగులతో చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాం. వారి అపోహలను తొలగించే యత్నం చేసింది. సీఎం జగన్ ఎప్పుడూ ఉద్యోగులకు మేలు చేస్తూనే ఉన్నారు. ఇన్నాళు ఉద్యోగులు అడగకుండానే అన్నీ చేశాం' అని సజ్జల తెలిపారు.

# 13 మంది పోలీసు ఆఫీసర్లకు పీపీఎం, పీఎం మెడల్స్

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. తెలంగాణకు రెండు ప్రెసిడెంట్ పోలీసు మెడల్స్, మరో 11 మంది పోలీసులకు పోలీసు మెడల్స్ లభించాయి. విశిష్ట సేవలందించినందుకు గానూ టీఎస్ఎస్‌పీ మూడో



బెటాలియన్(ఇబ్రహీంపట్నం) కమాండంట్ చాకో సన్నీకి, పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ విభాగంలోని ఐజీపీ ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జీ శ్రీనివాస్ రాజుకు ప్రెసిడెంట్ పోలీసు మెడల్స్ లభించాయి.

# జడ్జిలపై అనుచిత వ్యాఖ్యల కేసుపై హైకోర్టులో విచారణ

అమరావతి: జడ్జిలపై అనుచిత వ్యాఖ్యల కేసుపై హైకోర్టులో విచారణ జరిగింది. జడ్జిలపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌లను తక్షణమే తొలగించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సోషల్ మీడియాలో పోస్టులను తొలగించాలని తాము లేఖ రాసినా ట్విటర్, ఫేస్‌బుక్, యూట్యూబ్ పట్టించుకోలేదని కోర్టుకి సీబీఐ లాయర్ తెలిపారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లేఖకు కూడా స్పందించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సీబీఐ లేఖ రాస్తే కోర్టు ఉత్తర్వులుగానే పరిగణించాలంటూ ట్విటర్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఇకపై ఈ ఆదేశాలను తప్పక పాటించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ, రిజిస్ట్రార్ జనరల్ లేఖలపై ఎందుకు స్పందించడం లేదంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల తరపు లాయర్లను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణను ఈ నెల 31కి హైకోర్టు వాయిదా వేసింది.




# రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పోరు బాట

విజయవాడ /హైదరాబాద్ జనవరి 25 రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటు ఏపీలో ఇటీవల ప్రకటించిన పీఆర్సీని వెనక్కి తీసుకోవాలని.. ఇటు తెలంగాణలో బదిలీల కోసం తెచ్చిన 317 జీవోను సవరించాలని ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ ఉద్యోగులుగా తమ పనులను సక్రమంగా నిర్వర్తించాల్సిన ఈ ఉద్యోగుల ప్రభుత్వాల తీరుతో ఇలా రోడ్డుపైకి వచ్చాయని విపక్షాలు అంటున్నాయి. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపిస్తున్నాయి.ఏపీలో పీఆర్సీతో సహా 70 డిమాండ్ల కోసం ప్రభుత్వ ఉద్యోగులు గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వ ఉద్యోగులకు 23.29 శాతం ఫిట్మెంట్ ప్రకటించారు. ఈ పీఆర్సీతో వేతనాలు పెరగకపోగా.. గతంలో కంటే తక్కువగా వస్తాయని అనుకుంటున్న ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు.సీఎస్కు సమ్మె నోటీసు కూడా అందించారు. ప్రభుత్వం తరపున చర్చలకు రావాలంటూ మంత్రులు ఆహ్వానించినా.. ఉద్యోగ సంఘాల నేతలు మాత్రం ససేమిరా ఒప్పుకోవడం లేదు. పీఆర్సీ జీవో రద్దు చేస్తేనే చర్చలకు వస్తామంటూ తెగేసి చెబుతున్నారు. వివిధ ఉద్యోగ సంఘాలు పీఆర్సీసి సాధన సమితిగా ఏర్పడి ఉద్యమానికి సిద్ధమయ్యాయి. ఫిబ్రవరి 6 అర్ధరాత్రి నుంచి సమ్మెకు వెళున్నట్లు ప్రకటించాయి.మరోవైపు తెలంగాణలో కొత్త జోన్ల వారీగా ఉద్యోగుల కేటాయింపులు.. బదిలీలు వివాదస్పదంగా మారాయి. క్యాడర్ కేటాయింపుల కోసం కేసీఆర్ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 317ను సవరించాలని ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ఈ జోవో కారణంగా ఆందోళనకు గురైన కొంతమంది ఉద్యోగులు మరణించారని కేసీఆర్పై విపక్షాలు మండిపడుతున్నాయి.ఈ జీవోను సవరించాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్షకు దిగడం..అడ్డుకున్న పోలీసులుఅరెస్టు చేయడం..జైలుకు తరలించడం..రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు ఈ జీవో సవరణ కోసం ఉద్యోగులు ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు.

# షర్మిల పార్టీలో కమిటీలు రద్దు..

హైదరాబాద్ జనవరి 25 ;తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తానంటూ.. పార్టీని ఏర్పాటు చేసిన వైఎస్ తనయ.. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలికి టైం ఏమాత్రం కలిసిరావడం లేదని అంటున్నారు పరిశీలకులు. క్షేత్రస్థాయిలో పార్టీ పుంజుకోవడం లేదు. నిజానికి పార్టి పెట్టి తక్కువ సమయమే అయినా.. ఆమె హడావుడి మాత్రమే కనిపిస్తోం ది తప్ప.. ఎక్కడా పార్టీలో నేతల హవా కనిపించడం లేదు. పైగా జిల్లా స్థాయిలో ఎక్కడా పార్టీ పుంజుకోవ డం లేదు.అందుకే ఇలాంటి పరిస్థితి వచ్చిందని షర్మిల భావిస్తున్నారు.ఈ నేపథ్యంలోనే పార్టీ ఏర్పాటు చేసిన సమయంలో నియమించిన పార్లమెంటు నియోజకవర్గాలకు కోఆ ర్డినేటర్ లను రాష్ట్రస్థాయిలో అధికార ప్రతినిధులను సోషల్ మీడియా తో పాటుగా పలు రకాల విభాగాల ఇన్చార్జి లను తాజాగా రద్దు చేస్తున్నట్లు షర్మిల ప్రకటించారు. తాజాగా నియమించిన కోఆర్డినేటర్ల విషయానికి వస్తే గ్రేటర్ హైదరాబాద్ కు వడుక రాజగోపాల్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గడిపల్లి కవిత వరంగల్ హనుమకొండలకు నాడెం శాంతి కుమార్ ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి గా బెజ్జంకి అనిల్ కుమార్ నిజామాబాద్ జిల్లాకు నీలం రమేష్ యాదాద్రి భువనగిరి జిల్లాకు మహమ్మద్ అత్తార్ ఖాన్ వికారాబాద్ జిల్లా కు తమ్మాలి బాలరాజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు అప్పం కిషన్ నల్గొండ జిల్లాకు ఇంజమ్ నర్సిరెడ్డి ములుగు జిల్లాకు రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి రంగారెడ్డి జిల్లాకు ఎడమ మోహన్ రెడ్డి నారాయణపేట జిల్లాకు మడివాల కృష్ణను నూతన కోఆర్డినేటర్లు గా నియమించారు.

# సంపాదకీయం

బుధవారం 26 జనవరి 2022

## హిందుత్వం చుట్టూ రాజకీయాలు

హిందుత్వ? ఈ అంశం ప్రతీ ఎన్నికల్లో వినిపించేదే అయినా.. ప్రస్తుతం జరుగుతున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో మరీ ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికల్లో కాస్త ఎక్కువగా వినిపిస్తూ వుంటుంది. ఇంకా చెప్పాలంటే ప్రతీ సారి కంటే ఈసారి ఇంకాస్త ఎక్కువగానే వినిపిస్తోందీ అంశం. దానికి కారణం గత అయిదేళ్ళలో యుపీలో చోటుచేసుకున్న పరిణామాలే అని ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు. ఇక రాజకీయ పార్టీల వైఖరి కూడా హిందుత్వపై కాసింత మారినట్లుగానే పరిగణించాల్సిన పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో కనిపిస్తోంది. దానికి కారణలేమంటే రాజకీయ విశ్లేషకులు పలు అంశాలను తెరమీదికి తెస్తున్నారు. 2017 ఎన్నికల్లో ఎవరినీ ముఖ్యమంత్రిగా ప్రొజెక్ట్ చేయకుండానే బీజేపీ ఘన విజయం సాధించింది. 403 సీట్లున్న యుపీ అసెంబ్లీలో ఏకంగా 325 సీట్లను ఆనాటి ఎన్నికల్లో బీజేపీ గెలుచుకుంది. అప్పటికి గోరఖ్‌పూర్ ఎంపీగా రెండుసార్లు గెలిచిన కరడుగట్టిన హిందుత్వవాదిగా పేరున్న యోగీ ఆదిత్యనాథ్(ని రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై బీజేపీ కూర్చొబెట్టింది. ఈ నిర్ణయం వెనుక భవిష్యత్ కార్యాచరణ వ్యూహం వుందని ఆనాడే పలువురు ఊహించారు. అనుకున్నట్లుగానే 2017-2022 మధ్య కాలంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో పలు మార్పులు జరిగాయి. ముఖ్యంగా చెప్పాలంటే అయోధ్యలో రామ్ మందిర్ నిర్మాణం ప్రారంభం కావడం, కాశి విశ్వేశ్వర ఆలయ ప్రాంగణం సుందరీకరణ పూర్తి కావడం, అలహాబాద్ సహా పలు నగరాలు, పట్టణాల పేర్లను మార్చి వేయడం వంటివి గత అయిదేళ్ళలో జరిగాయి. అలహాబాద్‌కు ప్రయాగ్ రాజ్ అని, అయోధ్య టెంపుల్ దగ్గరలోని ఫైజాబాద్ రైల్వేస్టేషన్‌కు అయోధ్య కంటోన్మెంట్ స్టేషన్ అని నామకరణం చేశారుఈ క్రమంలో యుపీలో రాజకీయ పరిణామాలు మతాల ప్రాతిపదికన మారిపోయాయి అని చెప్పాల్సి వస్తోంది. ఎందుకంటే.. ప్రస్తుతం జరుగుతున్న యుపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సూటిగాను, సమాజ్ వాదీ పార్టీ పరోక్షంగాను ముస్లింల మద్దతు కోరుతున్న పరిస్థితి కనిపిస్తోంది. మిగిలిన పార్టీలు హిందుత్వకు వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడని సంకేతాలు కనిపిస్తున్నాయి. యుపీలో ముస్లింల ఓట్లు 19 శాతంగా వున్నాయి. ఈ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించిన ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్.. ప్రస్తుత ఎన్నికలు 80 శాతానికి 20 శాతానికి మధ్య జరుగుతున్న పోరాటంగా అభివర్ణించారు. అంటే పరోక్షంగా ఆయన 19 శాతం వున్న ముస్లింల ఓట్లను ప్రస్తావించినట్లేనని జాతీయస్థాయి మీడియా సంస్థలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దాంతో 19 శాతం వున్న ముస్లింల ఓట్లకు ఆశపడే కంటే హిందువులకు వ్యతిరేకంగా ముద్ర వేయించుకోకపోవడమే బెటర్ అని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయని అంటున్నారు. యుపీలోని మొత్తం 403 సీట్లలో 255 సెగ్మెంట్లలో ముస్లింల ఓట్లు 6 శాతం కంటే తక్కువగా వున్నాయి. సో.. ఆ సెగెంట్లలోని హిందువుల ఓట్లు విషయంలో ప్రతికూలత రాకూడదన్న ఉద్దేశంతోనే రాజకీయ పార్టీలు హిందుత్వకు వ్యతిరేకంగా వెళ్ళకుండా జాగ్రత్తపడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అంఛనా వేస్తున్నారు. అయితే 35 నుంచి 50 శాతం ముస్లింల ఓట్లున్న నియోజకవర్గాలు కూడా పెద్ద సంఖ్యలోనే వున్నాయి. ఈ నియోజకవర్గాలలో ముస్లింల ఓట్లు ఎంఐఎంవైపు మొగ్గుచూపుతాయా లేక విపక్ష సమాజ్ వాదీ పార్టీవైపు మొగ్గుచూపుతాయా అన్నది తేలాల్సి వుంది. తాజాగా సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ ముస్లింల ర్యాలీలపై కొద్దిమేరకు వైఖరి మార్చుకున్నట్లు కనిపిస్తోంది. తొలుత ముస్లింల ఓట్ల కోసం ప్రత్యేకంగా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని భావించిన అఖిలేశ్.. ఎంఐఎం బలపడుతున్న సంకేతాలు రావడంతో కొన్ని నియోజకవర్గాల్లో మరీ ముఖ్యంగా 30 శాతం కంటే ఎక్కువగా ముస్లింల ఓట్లు ఉన్న ప్రాంతాల్లో వారి ఓట్లు పోలరైజ్ అయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందుకోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించేలా ఎస్పీ వ్యూహకర్తలకు అఖిలేశ్ నిర్దేశించినట్లు సమాచారం. ఇక ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్.. తొలిసారి అసెంబ్లీ బరిలో ప్రత్యక్ష పోరుకు సిద్దమయ్యారు. ఆయన గోరఖ్‌పూర్ అర్బన్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు. ఈ మేరకు యోగీ తీసుకున్న నిర్ణయం అఖిలేశ్ యాదవ్‌పై ఒత్తిడికి కారణమైంది. ఆయనా గతంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించినప్పటికీ ఎమ్మెల్సీ కోటాలోనే ఆయన పదవీకాలాన్ని పూర్తి చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో యోగీ ఆదిత్యనాథ్‌తోపాటు అఖిలేశ్ యాదవ్ కూడా ముఖ్యమంత్రి పదవి రేసులో వున్నారు. ఈనేపథ్యంలో అఖిలేశ్ కూడా ప్రత్యక్ష పోరుకు రెడీ అయ్యేలా ఒత్తిడి పెరుగుతోంది. దాంతో ఇద్దరు ముఖ్యమంత్రి క్యాండిడేట్లు తొలిసారి ప్రత్యక్షంగా ఎన్నిక బరిలోకి దిగడం ఆసక్తి రేపుతోంది.

## పుట్టపర్తిలో నేతల మధ్య సవాళ్లు

అనంతపురం, జనవరి 25, (న్యూస్ పల్స్)నిత్యం ప్రశాంతంగా ఉండే ఆ ఆధ్యాత్మిక కేంద్రం.. పౌరుషాల గడ్డగా మారుతోంది. ఎంతో సౌమ్యంగా ఉండే నాయకులు కయ్యానికి కాలు దువ్వుతున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ రంకెలు వేస్తున్నారు. మొన్నటి వరకు శ్మసానం చుట్టూ సాగిన రాజకీయాలు.. ఇప్పుడు వ్యక్తిగత సవాళ్లకు దిగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నీపై 50వేల మెజార్టీతో గెలవకపోతే.. ఎమ్మెల్యే పదవినే త్యజిస్తానని ఒకరంటే.. అసలు డిపాజిట్ వస్తుందో లేదో చూసుకోమని మాజీ మంత్రి అంటున్నారు. ఇక్కడ మరో విశేషమేమిటంటే ఆ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గురు శిష్యులే. మరి గురు శిష్యుల మధ్య మాటల వార్ ఎందుకు వచ్చింది?పుట్టపర్తి.. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం.. సత్యసాయి బాబా కొలువుదీరిన ఈ ప్రాంతానికి ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి భక్తులు వస్తుంటారు. దీనికి ప్రధానమైన కారణం.. ఇక్కడ ప్రశాంతత ఉంటుందని. అయితే ఇంత ప్రశాంతమైన పుట్టపర్తి ఇప్పుడు రాజకీయ రణరంగాన్ని తలపిస్తోంది. ఇక్కడ రాజకీయాలు బలంగా ఉన్నా.. ఎప్పుడూ నేతలు కాంట్రవర్షీ చేసుకోరు. కానీ ఈసారి ఎందుకో అధికార ప్రతిపక్షాలు హద్దులు మీరి విమర్శలు చేసుకుంటున్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మధ్యఫైట్ ఒక రేంజ్ లో నడుస్తోంది. వాస్తవంగా వీరిద్దరూ చాలా సౌమ్యులు.. వివాదరహితులు. కాకపోతే.. గత నెల రోజుల నుంచి వీరి మాటలు పుట్టపర్తిలో రాజకీయ వేడి పుట్టిస్తున్నాయి. అసలు సమస్య ఎక్కడ మొదలైందంటే.. పుట్టపర్తి పట్టణ నడిబొడ్డున ఒక స్మశాన వాటిక ఉంది. ఉన్నది చాలా తక్కువ విస్తీర్ణంలో ఉన్న స్మశానవాటిక వద్ద అర్బన్ హెల్త్ సెంటర్ నిర్వహించాలని అధికారులు భావించారు. ఇదే వివాదానికి ఆజ్యంపోసింది.అయితే, ఇది ప్రజలకు ఇబ్బంది అవుతుందని మాజీ మంత్రి పల్లెతో పాటు బీజేపీ నేతలందరూ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇందుకోసం భారీగా నిరసలు కూడా చేపట్టారు. ప్రతిపక్షాల విమర్శలపై ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఆయన సహజ గుణంకి విరుద్ధంగా మంచి పనులు చేస్తే అడ్డుకుంటారా.. ఈసారి ఇక్కడ ఎవరైనా అడ్డుకుంటే.. పిడుగుద్దులు గుద్దండి.. తరిమికొట్టండంటూ పిలుపునిచ్చారు. దీంతో మాజీ మంత్రి పల్లె తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. అధికార మదంతో మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డికి కళ్లు తెరిపిస్తానంటూ మండిపడ్డారు. ఇక అక్కడి నుంచి ప్రారంభమైన వార్ ఇప్పుడు పీక్ స్టేజ్‌కు చేరింది. అసెంబ్లీలో చంద్రబాబును అవమానించారని, మాజీ మంత్రి పల్లె సెంట్ మెంట్ సీన్ క్రియేట్ చేయడంతో.. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సెంటిమెంట్ కు ఆయింట్ మెంట్ కంటే ఘాటుగా రిప్లై ఇచ్చారు.అయితే, ఆ తరువాత కూడా శ్రీధర్ రెడ్డి మాటల దాడి ఆపలేదు.. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం జగనన్నతోనే సాధ్యమన్న నినాదంతో శ్రీధర్ రెడ్డి జనంలోకి వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె పై ఒక రేంజ్‌లో ఫైర్ అయ్యారు. మాజీ మంత్రి పల్లె సహా ఇక్కడ ప్రతిపక్ష పార్టీ తరఫున పోటీ చేయాలనుకుంటున్న వారంతా నాన్ లోకల్ వాళ్లే అన్నారు. ప్రతి ఒక్కరికీ అన్నీ చేస్తున్నామని.. వచ్చే ఎన్నికల్లో 50 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అలా గెలవ లేకపోతే ఎమ్మెల్యే పదవి కూడా నాకు వద్దు అని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలో 30ఏళ్లుగా ఉంటున్న మాజీ మంత్రి పల్లె చేసింది శూన్యమని.. అసలు ఆయనది ఈ ప్రాంతమే కాదని.. కదిరి నుంచి వలస వచ్చారన్నారు. నేను నాన్ లోకల్ కాదని నిరూపిస్తే నా రూ.5వందల కోట్లు రాసిచ్చేస్తానని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అన్నారు. అసలు పది మంది నాన్ లోకల్ నాయకులు టీడీపీలో టికెట్ కోసం కోట్లాడుతున్నారని.. వారిలో వారికి క్లారిటీ లేదన్నారు?ఈ వ్యాఖ్యలపై మాజీ మంత్రి పల్లె కూడా అదే స్థాయిలో రియాక్ట్ అయ్యారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఒక బచ్చా అని.. నా దగ్గర చదువుకున్న స్టూడెంట్స్ లో అతను కూడా ఒకడు అంతే. అధికారం ఉందనే మదంతో మాట్లాడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో చిన్న పిల్లాడిని అడిగినా నేను ఎవరినో చెబుతారని, నీకు నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి ఎన్ని పంచాయితీ లు ఉన్నాయో తెలుసా అని ప్రశ్నించారు. నన్ను నాన్లోకల్ అంటే నువ్వు పుట్టింది అనంతపురంలో, చదివింది. కొడిగెనహళ్లి లో, వ్యాపారాలు బెంగళూరులో చేసుకుంటున్నావు అని మండిపడ్డారు. 27 సంవత్సరాలుగా నియోజకవర్గంలో భూములు, ఇళ్లు కలిగి ఉండి ప్రజలను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నాన్నారు. నేను నాన్ లోకల్ అని నిరూపిస్తే.. నా ఆస్తులుగా చెబుతున్న రూ.2వేల కోట్ల ప్రాపర్టీస్ రాసిస్తానన్నారు.అసలు ఇంతలా పోట్లాడుతున్న వీరి ఫైట్ లో ఇంకో ట్విస్ట్ ఉంది. అదేంటంటే.. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఒకప్పుడు ప్రొఫెసర్.. ఆయన వద్ద ఇంటర్మీడియట్ లో కమెస్ట్రీ క్లాస్ లు విన్న వ్యక్తే శ్రీధర్ రెడ్డి. మరి ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చిన తరువాత గురు శిష్యులు కాస్త ప్రత్యర్థులయ్యారు. రఘునాథ్ రెడ్డి గారు నాకు గురవని.. అయితే రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థేనంటూ శ్రీధర్ రెడ్డి. నాఊరు పుట్టపర్తి నియోజకవ్గంలోనే ఉంది. మరి నీ ఊరు ఏందంటే ఏం చెబుతావ్ అని ప్రశ్నిస్తున్నారు శ్రీధర్ రెడ్డి. నేను మళ్లీ చెబుతున్నా.. గతంలో 30వేల మెజార్టీతో గెలిచాను.. ఈ సారి 50వేలతో గెలుస్తా.. అలా గెలవకపోతే ఎమ్మెల్యే పదవిని త్యజిస్తానని స్పష్టం చేశారు?నిన్నటి వరకు సౌమ్యంగా కనిపించిన గురు శిష్యులు ఇప్పుడు రాజకీయ శత్రువులుగా మారిపోవడం.. నియోజకవర్గంలో పెద్ద హాట్ టాపిక్ గా మారింది. అసలు సమయం సందర్భం లేకుండా వీరు చేసుకుంటున్న సవాళు ,, ప్రతి సవాళ్లు మాత్రం ఆధ్యాత్మిక క్షేత్రంలో వేడి పుట్టిస్తున్నాయి?

## మళ్లీ ఢమాల్ అన్న టమాట



కర్నూలు, జనవరి 25, (న్యూస్ పల్స్) కొన్ని రోజుల క్రితం వరకూ టమాటా ధర చుక్కలను తాకింది. గత ఏడాది చివరిలో ఆంధ్ర ప్రదేశ్ లో కురుసిన వర్షాలతో టమాటా ధర ఆల్ టైం హై కు చేరుకుంది. రైతులకు లాభాలను.. సామాన్యులకు కంట కన్నీరు పెట్టించాయి. అయితే ఇప్పుడు టమాటా ధరలు అకస్మాత్తుగా నేలచూపులు చూస్తున్నాయి. నిన్నా మొన్నటి వరకూ కిలో రూ.40, రూ. 50 ఉన్న టమాటా ధర.. నేడు కిలో పది రూపాయలు అన్నా కొనేవారు లేరు.కర్నూలు జిల్లాలో టమోటా ధరలు చిత్రవిచిత్రంగా పలుకుతున్నాయి. కిలో టమోటా ధర వంద రూపాయల నుంచి ఏకంగా పది రూపాయలకు పడిపోయింది. మార్కెట్లో ప్రతిరోజు హెచ్చుతగ్గులు ఉండటంతో ఎప్పుడు ధర ఉంటుందో ఎప్పుడు తగ్గుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో టమోటా మార్కెట్ లో మదనపల్లి తర్వాత అతిపెద్దది పత్తికొండ మార్కెట్. ప్రతిరోజు టన్నుల కొద్ది టమోటా మార్కెట్ కు తరలి వస్తున్నది. ఇక్కడే టమోటా చాలా రుచికరంగా ఉండటంతో ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అవుతోంది. దీంతో రైతులు విపరీతంగా సాగు చేశారు అధిక వర్షాల కారణంగా దిగుబడి ఈసారి పూర్తిగా తగ్గిపోయింది. ధరల మాత్రం ఈసారి సంతృప్తినిచ్చినప్పటికీ ఎక్కువ రోజులు నిలకడగా ఉండడం లేదు. మొన్నటి వరకు 100 రూపాయలు పెరిగిన టమోటా ధర ఆ తర్వాత 50, 30, 27,? నేడు 10 రూపాయలకు పడిపోయింది? ఇంకా పడి పోతుందేమోనన్న భయం రైతులను వెంటాడుతోంది? ధరలు తగ్గకుండా ఎగుమతులు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారుఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో టమోటా పంట అధికంగా పండుతుంది. ముఖ్యంగా మదనపల్లిలో టమాటా అధికంగా పండిస్తారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటె.. ఒకే.. అయితే గత రెండు మూడు సంవత్సరాల నుంచి ధర ఉన్న సమయంలో వర్షాలు, వరదలు.. చేతికి పంట అంది వచ్చే సరికి ధర లేకపోవాడంతో అక్కడ టమాటా రైతులు విపరీతంగా నష్టపోతున్నారు. గత ఏడాది నవంబర్ లో కురిసిన భారీ వర్షాలకు చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాలో టమోటా పంట దెబ్బతింది. దీంతో ఆ సమయంలో టమాటా ధర కిలో 150 వరకూ చేరుకుంది. రైతులకు సిరులు.. సామాన్యులకు అందని ద్రాక్షగా నిలిచింది ఆ సమయంలో.. అయితే ఇప్పుడు చిత్తూరు, అనంతపురం జిలాల్లో టమాటా పంట రైతుల చేతికి వచ్చింది. అయితే ఇతర రాష్ట్రాలనుంచి టమాటా దిగుమతి ఉండడంతో.. ఇప్పుడు స్థానిక టమాటా ధర పంటకు ధర వచ్చే పరిస్థితులు లేవు. దీంతో స్థానిక టమాటా పంటకు ధరలు లేక రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## ఏపీలో 89 వేల మందే రైతులా..?



విజయవాడ, జనవరి 25, (న్యూస్ పల్స్)నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం వైఎస్ఆర్ రైతు భరోసా వరుసగా మూడవ ఏటా కౌలు రైతులకు నామమాత్రంగానే దక్కింది. రాష్ట్రంలో లక్షలాదిగా కౌలు రైతులుండగా కేవలం 89 వేల మందికే పెట్టుబడి సాయం అందింది. 2020-21లో నాలుగు లక్షల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి) జారీ చేయగా, ఏడాదిలో మూడు విడతల్లో భరోసా రూ.1,3500 నిమిత్తం భూమి లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కౌలు రైతులను అర్హులుగా ఎంపిక చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులే తక్కువ ఇవ్వగా, వాటిలోనూ ఒక వంతుకు సైతం సాయం దక్కలేదు. భరోసా పథకం మొదలైన నాటి నుండి కౌల్దార్లకు సర్కారు మొండి చెయ్యే చూపిస్తోంది. తొలేట 2019లో 63,023 మంది, రెండవ సంవత్సరం 2020లో 69,276 మంది భరోసాకు అర్హత సాధించగా, ముచ్చటగా మూడవ ఏట కూడా అదే ధోరణి కొనసాగింది. మూడవ సంవత్సరం 89,877 మంది భరోసాకు ఎంపిక చేశారు. అనేక వడ పోతల తర్వాత అర్హత సాధించినా, వారందరికీ సక్రమంగా పేమెంట్ జరగలేదు. ఆధార్, బ్యాంక్ అకౌంట్, సిసిఆర్‌సి అప్‌లోడ్ ఇత్యాది సాంకేతిక కారణాల మూలంగా సొమ్ము జమ కాలేదు. ఉన్నంతలో గుంటూరులో అత్యధికంగా, చిత్తూరులో అత్యల్పంగా లబ్ధి పొందారు.పంటల సరళి, వ్యవసాయ కార్పొరేటీకరణ వలన రాష్ట్రంలో కౌలు సేద్యం అంతకంతకూ పెరుగుతోంది. ఎపిలో 32 లక్షల కౌలు రైతులున్నారని ప్రభుత్వమే చెబుతోంది. స్వంత భూమి కలిగిన వారితో పాటు కౌలు రైతులందరికీ భరోసా ఇస్తామంది వైసిపి. అధికారంలోకొచ్చాక 15 లక్షల కౌల్దార్లకు సాయమని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చింది. భూమి లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు ఆరు లక్షల మందికి కచ్చితంగా భరోసా అందిస్తామంది. పథకం మొదలై మూడేళ్లయినా లక్ష మార్క్? చేరలేదు. కౌలు రైతుల గుర్తింపులోనే సమస్య ఉంది. పంట సాగుదారు హక్కు చట్టం (సిసిఆర్‌సి) ప్రకారం కార్డు పొందాలంటే భూయజమాని రాతపూర్వక ఆమోదం తప్పనిసరి. దాంతో సిసిఆర్‌సిల జారీ ఒక పట్టాన సాగట్లేదు. సర్కారు ఎంతగా స్పెషల్ డ్రైవ్‌లని చెప్పినా, గ్రామ సచివాలయ స్థాయిలో గుర్తింపు అన్నా పెద్దగా ప్రయోజనం లేదు. పైగా బినామీలు, అనర్హులు సిసిఆర్‌సిలు పొంది ప్రభుత్వ పథకాలు అనుభవిస్తున్నారు.కౌలు రైతులకు భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ దృష్టిలోనే లోపం ఉంది. కేంద్రం మొత్తానికే కౌల్దార్లకు పెట్టుబడి సాయం నిరాకరించింది. పిఎం కిసాన్‌తో కలిపి భరోసాను అమలు చేసే క్రమంలో రెండేళ్ల నుండి ఎపి సర్కారు ఖరీఫ్‌కు ముందే తన వాటాను భూయజమానులకు విడుదల చేస్తోంది. కౌలు రైతులకు ఎప్పుడో అక్టోబర్, నవంబర్‌లో ఒకేసారి రెండు విడతలు, జనవరిలో మూడవ విడత సొమ్ము జమ చేస్తోంది. వాస్తవంగా భూమిపై శ్రమ చేసే వారికే జాప్యం చేస్తోంది. ఇచ్చేదే తక్కువ మందికి కాగా దాని కోసం కౌల్దార్లు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

## చంద్రబాబు పర్యటనతో ఉలుకు పలుకు

తిరుపతి, జనవరి 25, (న్యూస్ పల్స్)వైసీపీ నేతలు అక్రమ మైనింగ్‌తో కుప్పంను తవ్వేస్తున్నారని ఈ నెల ప్రారంభంలో చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో ఆరోపించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రమాదకర ప్రాంతాల్లో పర్యటించిన చంద్రబాబు అక్కడ క్వారీ జరుగుతున్న తీరును చూసి ఆశ్చర్యపోయారు. ఎలాంటి అనుమతులు లేకుండా నియోజకవర్గంలోని శాంతిపురం, గుడుపల్లె మండలాలలో పెద్ద ఎత్తున క్వారీలు జరుగుతున్నట్లు స్థానిక ప్రజలు ఆధారాలను కూడా ఇచ్చారు. దీనిపై టీడీపీ అధినేత ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేశారు. అయితే అక్కడ అక్రమ మైనింగేమీ లేదని వెంటనే వైసీపీ నేతలు రివర్స్ అయ్యారు. మంత్రి పెద్దిరెడ్డితోపాటు మైనింగ్ మంత్రి కూడా అదే మాట చెప్పారు. కానీ మూడు వారాలు గడిచేప్పటికి పరిస్థితి మారిపోయింది. పెద్ద ఎత్తున మైనింగ్ అధికారులు కుప్పంలో అక్రమ మైనింగ్‌పై దృష్టి పెట్టారు. నాలుగు బృందాలుగా విడిపోయి క్వారీల్లో సోదాలు చేసి.. పదుల సంఖ్యలో క్వారీల్ని సీజ్ చేశారు. పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతోందని గుర్తించారు. తరలింపుకు సిద్ధంగా ఉన్న గ్రానైట్ దిమ్మెలను..వందల సంఖ్యలో లారీలను సీజ్ చేశారు. కొద్ది రోజులుగా కుప్పం నియోజకవర్గం అంతటా మైనింగ్ అధికారులు దాడులు కొనసాగిస్తూనే ఉన్నారు.. ఇప్పటి వరకు మైనింగ్ కు వినియోగించే నాలుగు ప్రొక్లెయినర్లు, 10 కంప్రెసర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.. తరలించడానికి సిద్ధంగా ఉన్న 200 గ్రానైట్ దిమ్మెలను సీజ్ చేశారు. ఈ దాడులు మరిన్ని రోజుల పాటు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు, కాగా అధికారుల తనిఖీలతో మైనింగ్ మాఫియా ఎక్కడికక్కడ సైలెంట్ అయ్యారు.అయితే ఇది కంటి తుడుపు చర్యలేనని.. దోచుకెళ్లిపోయింది ఎంతో ఉందని టీడీపీ నేతలు అంటున్నారు.

## సింహపురిలో పుష్ప రాజ్ లు

నెల్లూరు, జనవరి 25, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా రాపూరు అటవీప్రాంతంలో భారీగా ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్నారు పోలీసులు. రాపూరు ఫారెస్టులో భారీగా తమిళనాడు కూలీలు ఉన్నారనే పక్కా సమాచారంతో పోలీసులు రైడ్ చేశారు. 55 మంది కూలీలను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో రవాణాకు సిద్ధంగా ఉన్నభారీగా ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి వాహనాలను ఆపకుండా.. గొడ్డళ్లను సైతం విసిరినట్లు వివరించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి వీరి వెనకున్న ప్రధాన నిందితులను అరెస్టు చేస్తామన్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని రాపూరు అటవీ ప్రాంతంలో తమిళనాడు, పాండిచ్చేరికి చెందిన 55 మంది కూలీలతో స్మగ్లర్లు ఎర్రచందనం దుంగల్ని నరికిస్తున్నారు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు అటవీ ప్రాంతానికి బయల్దేరారు. పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో ఎర్రచందనం స్మగ్లర్లు అడవిలో నుంచి పారిపోయే ప్రయత్నం చేశారు.పక్కా సమాచారంతో రైడ్ చేసిన పోలీసులు.. మొత్తం 55 మంది ఎర్రచందనం నరికే కూలీలు, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన దాము, పాండిచ్చేరికి చెందిన పళని, వేలూరుకు చెందిన సుబ్రమణ్యంలు పైలెట్లుగా వ్యవహరిస్తూ, 55 మంది తమిళనాడు కూలీలను తీసుకువచ్చి రాపూరు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నరికినట్లు పోలీసులు చెప్పారు. సుమారు 40 లక్షల వరకు విలువ చేసే 45 ఎర్రచందనం దుంగలు, రెండు వాహనాలు, 31 సెల్ ఫోన్లు, 75 వేల రూపాయల నగదు, గొడ్డళ్లు, బరికెలు స్వాధీనం చేసుకున్నారు. కూలీలంతా పాండిచేరి, చెన్నైకి చెందిన వారిగా పోలీసులు తెలిపారు.

## పడిపోయిన అరటి పండ్ల ధరలు

రాజమండ్రి, జనవరి 25, (న్యూస్ పల్స్)అరటి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా రాక నష్టపోతున్నాడు. కూలి, రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో అరటి గెలలను కోయకుండా చెట్లకే వదిలేస్తున్నారు. కాయలు పండిపోయి రాలిపోతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పది వేల ఎకరాలకుపైగా అరటి సాగవుతోంది. పెరవలి, పెనుగొండ, కొవ్వూరుతోపాటు గోదావరిని అనుకుని ఉన్న లంక గ్రామాల్లోనూ, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట వంటి మెట్ట మండలాల్లోనూ అరటిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అరటి గెలల కోత సీజన్ ప్రారంభమైంది. వ్యాపారులు, దళారులు రైతుల నుంచి అరటి గెలను రూ.వంద, రూ.110కు కొనుగోలు చేస్తున్నారు. గెలకు రూ.150పైగా ధర వస్తే తప్ప కనీసం ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెప్తున్నారు. ఒక ఎకరాలో 750 అరటి మొక్కల వరకూ నాటుతారు. తొలి ఏడాది వెదురు గెడల కొనుగోలు, ఎరువులు వంటి ఖర్చులన్నీ కలిపి ఎకరాకు రైతులకు రూ.లక్షకుపైగా, కౌలు రైతులకు కౌలుతో కలుపుకొని రూ.1.40 లక్షల వరకూ ఖర్చవుతోంది. రెండో ఏడాది గెడల ఖర్చు తగ్గుతుంది. తొమ్మిది నెలలకు అరటి పంట కోతకు వస్తుంది. ఎకరంలో వేసిన 750 మొక్కలూ కాపుకాస్తే 750 గెలల దిగుబడి వస్తాయి. ప్రస్తుతం ధర ప్రకారం రూ.75 వేల నుంచి రూ.80 వేలులోపే ఆదాయం వస్తోంది. ఎకరా ఒక్కంటికీ రైతులకు రూ.20 వేలకుపైగా, కౌలు రైతులకు రూ.60 వేలకుపైగా నష్టం వస్తుండడంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అరటిని నిల్వ చేసుకోవడానికి వీలు ఉండదు. చెట్టున ఉండగానే కోతకోసి తరలించాల్సి ఉంటుంది. ఇదివరకూ తోట మొత్తం గుత్తగా వ్యాపారులు కొనుగోలు చేసేవారు. అనువైన సమయంలో అరటి గెలలను కోయించి తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. వ్యాపారులు తోట మొత్తాన్ని కొనేందుకు ముందుకు రావడం లేదని, గెలల ప్రాతిపదికన తామే మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెలలను కోసి తోట నుంచి వాహనాల్లో మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు అయిన ఖర్చు కూడా రావడం లేదని చెప్తున్నారు. అరటికి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మూడెకరాల్లో అరటి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం గెలలు కోతకు రావడంతో కోసి విక్రయిస్తున్నాం. గెల ఖరీదు రూ.వంద, రూ.110 మించి పలకడం లేదు. ఎకరాకు రూ.20 వేలకుపైగా నష్టపోతున్న పరిస్థితి ఉంది. అరటి రైతుల గురించి ప్రభుత్వం ఆలోచించి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి



# మంత్రులు..మౌనం ఎందుకని

విజయవాడ, జనవరి 25, (న్యూస్ పల్స్)కొడాలి నాని ఒంటరి అయ్యారా? వైసీపీ నుంచి ఆయనకు పెద్దగా మద్దతు లభించడం లేదా? మంత్రిగా ఆయన చూపిస్తున్న దూకుడుకు మిగిలిన నేతల్లో అసూయ బయలుదేరిందా? అంటే అవుననే అనిపిస్తుంది. కొడాలి నానికి ఎవరి మద్దతు అవసరం లేదు. తనకు తానుగానే తన వాదన వినిపించుకోగలిగిన శక్తి, సామర్థ్యం ఉంది. సాధారణంగా ఒక పార్టీలో నేతను విపక్షం టార్గెట్ చేస్తూ ఉంటే మిగిలిన మంత్రులు ఆయనకు మద్దతు పలుకుతుంటారు. గతంలో మంత్రుల మీద ఆరోపణలు వచ్చినా ఇదే జరిగింది. గుమ్మనూరి జయరాంపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు మిగిలిన బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు దానిని ఖండించారు. అయ్యన్నపాత్రుడు వంటి వారికి సమాధానమిచ్చారు. కానీ కొడాలి నాని విషయంలో మాత్రం అలా జరగడం లేదు. కొడాలి నాని ప్రస్తుతం క్యాసినో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. క్యాసినో ను కొడాలి నాని కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారా? లేదా? అన్నది పక్కన పెడితే అది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.తన కన్వెన్షన్ సెంటర్ లో ఎలాంటి క్యాసినోను నిర్వహించలేదని కొడాలి నాని చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరూపిస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఆయన ఛాలెంజ్ విసిరే పరిస్థితికి వచ్చారు. అయినా ఏ మంత్రి కూడా కొడాలి నానికి మద్దతుగా నిలవలేదు. ఒక్క దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాత్రం కొంత మద్దతు పలికారు తప్పించి మిగిలిన మంత్రులు ఎవరూ ఈ విషయంపై నోరు మెదపలేదు. మంత్రులు అందుకేనా? అంటే వైసీపీ కార్యకర్తలకు, అభిమానులకు మంత్రుల వ్యవహరించే తీరు అనుమానం కల్గించే విధంగా ఉంది. కొడాలి నాని క్యాసినో నిర్వహించి ఉంటారని, జగన్ దీనిని సీరియస్ గా తీసుకున్నారని భావించే మంత్రులు ఈ విషయంపై పెదవి విప్పడం లేదన్న అనుమానాలు క్యాడర్ లో ఉంది. నానికి బాగా జరిగిందని సంతోషపడి ఉండవచ్చు. సరే నిజంగా తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకోవచ్చు. దానిని ఎవరూ కాదనరు. ఒక జింక మీదకు సింహం వస్తే అన్ని జింకలు కలసి దానిని వెంటాడతాయి. కనీసం జంతువులకు ఉన్న ఐక్యత కూడా మంత్రులలో లేదని, కొడాలి నాని ఒంటరిగా పోరాటం చేయాల్సి వస్తుందన్న కామెంట్స్ వైసీపీ అభిమానుల నుంచే విన్పిస్తున్నాయి.

# నాయకుల మధ్య జెండా వార్..

తాడిపత్రి అనంతపురం జిల్లా తాడిపత్రిలో జాయ్ (జెసి)పార్క్ లో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించడానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పార్క్ లో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వరాదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మున్సిపల్ కమిషనర్ ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి విరుచుకుపడ్డారు. తాను నిర్మించిన పార్కు కు రిజిస్ట్రేషన్ ఉందని అన్ని ఖర్చులు బ్యాంకు ద్వారా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదన్నారు. ప్రతి ఏడాది పార్కు సంబంధించి ఆడిట్ చేస్తున్నామన్నారు .ఇటీవల ఎమ్మెల్యే నిర్మిస్తున్న పార్కు కు రిజిస్ట్రేషన్ ఉందా అని ప్రశ్నించారు. రిపబ్లిక్ డే రోజు పార్క్ లో జెండా ఎగిరేవేయకుండా చూడాలని అధికారులను బెదిరించడం, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చేస్తే వారు సమావేశానికి వెళ్లవద్దని అధికారులు బెదిరింపులు చేయడం ఎమ్మెల్యే కి సరికాదన్నారు. అధికారులు ఎదురు తిరిగితే తట్టుకోలేరన్నారు. ప్రజలు మీకు అధికారం కట్టబెట్టారని అధికారాన్ని ఉపయోగించి తాడిపత్రి అభివృద్ధికి కృషి చేస్తే సహకరిస్తామని హితవు పలికారు. మిమ్మల్ని గౌరవించినట్లు మీ కుటుంబ సభ్యులను గౌరవించాలనుకోవడం మీ అనైతిక చర్యలకు నిదర్శనమన్నారు. నేను అనుకుంటే మీ తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోలేవని ఎమ్మెల్యే ఉద్దేశించి పేర్కొన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా రిపబ్లిక్ డే రోజు జెండా ఎగురవేసి తీరుతామని జేసి తెలియజేశారు.

# విశాఖలో ఉద్యోగుల ర్యాలీ

విశాఖపట్నం పిఆర్సి జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిఆర్సి సాధన సమితి జిల్లా కమిటీ విశాఖలో భారీ ర్యాలీని చేపట్టింది.జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్జీవో కార్యాలయం నుంచి జరిగిన భారీ ర్యాలీలో ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈశ్వర్ రావు మాట్లాడుతూ ఉద్యోగులకు నష్టం కలిగే చర్యలు తీసుకోవడం వలన పిఆర్సి సాధన సమితి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. హెచ్ ఆర్ ఏ, ఫిట్మెంట్ జీవోలను రద్దు చేసే వరకు మంత్రుల కమిటీ చర్చలకు వెళ్ళమని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

# దళితుల నిరసన

విశాఖపట్నం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, జీవో 19 రద్దు చేయాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది.ఈ మేరకూ విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టింది.ఈ సందర్భంగా దళిత హక్కుల సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్ సి, ఎస్ టి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందనీ అన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విద్యను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెనుకబడిన విద్యార్థుల భవిష్యత్తు కోసం న్యాయస్థానాలు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

# ఘనంగా శ్రీధర్ రెడ్డి జన్మ దిన వేడుకలు

తిరుపతి తిరుచానూరు వై.కా.పా నాయకులు,గంగమ్మ గుడి చైర్మన్,మాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం, అన్న దాన శిబిరం, నవజీవన్ కంటి ఆసుపత్రికి విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు సర్పంచ్ రామచంద్ర రెడ్డి, తిరుచానూరు ఎం.పి.టి.సి నరేష్, బ్రాహ్మణ పట్టు ఎం.పి.టి.సి యోగానంద రెడ్డి ఉప సర్పంచ్ జమున పలువురు వై.సి.పి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# వరుస భేటీలతో కాపులు

కాకినాడ, జనవరి 25, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం బలమైనది. అందులో ఏమాత్రం సందేహం లేదు. ఒకరకంగా చెప్పాలంటే రాజకీయాలను శాసించే స్థాయిలో ఉంది. అత్యధిక ఓటర్లున్న సామాజికవర్గం కావడంతో ఏ రాజకీయ పార్టీ అయినా కాపులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. అది జగన్ అయినా, చంద్రబాబు అయినా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కాపులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. అయితే ఇటీవల కాపు నేతలందరూ సమావేశమై టీడీపీ, వైసీపీలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ కూటమిని ఏర్పాటు చేయాలని కాపునేతలంతా ఒక్కటయ్యారు.వివిధ పార్టీలో ఉన్న నేతలంతా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపారు. ఇందులో గంటా శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, జేడీ లక్ష్మీనారాయణ వంటి నేతలు కలిశారు. కానీ కాపు సామాజికవర్గం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ముద్రగడ పద్మనాభం. ఆయన తాను సొంతంగా బీసీలతో కలసి కూటమిని ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉన్నారు. ఆయన ముఖ్యమంత్రికి, ప్రధానికి, బీసీలు, దళితులకు లేఖలు రాస్తూ ఆ దిశగా ఆయన బిజీగా ఉన్నారు ముద్రగడకు రాష్ట్ర వ్యాప్తంగా కాపు సామాజికవర్గంలో అభిమానులున్నారు. ఆయన స్వభావం, కాపుల కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేసిన పనులు ఆయనకు ఆ పేరును తెచ్చి పెట్టాయి. ఇక ఉభయ గోదావరి జిల్లాల్లో కాపు సామాజికవర్గంలో ఆయనకు తిరుగులేదు. అటువంటి ముద్రగడను కలుపుకుని వెళ్లకుండా గంటా శ్రీనివాసరావు లాంటి నేతలు ఏర్పాటు చేసే కూటమికి కాపు సామాజికవర్గం నుంచి మద్దతు లభిస్తుందా? లేదా? అన్నది ప్రశ్నే. ఎందుకంటే గంటా శ్రీనివాసరావును కాపు సామాజికవర్గం నేత కంటే ఒక పారిశ్రామికవేత్తగా, రాజకీయనేతగానే చూస్తారు. ఆయన వల్ల తమ సామాజికవర్గానికి ఒనగూరిందేమీ లేదని, ఆయన అధికారంలో ఉన్నప్పుడు తమను ఎప్పుడూ పట్టించుకోలేదన్న భావన కాపు నేతల్లో ఉంది. అందుకోసమే ముద్రగడను కలుపుకుని వెళ్లాలన్న యోచనలో గంటా బ్యాచ్ ఉన్నట్లు తెలిసింది. అయితే ముద్రగడ అందుకు అంగీకరిస్తారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. వచ్చే అయితే నిన్న కాపు నేతలంతా జూమ్ కాన్ఫరెన్స్ లో సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. విజయాడలో వచ్చే నెల రెండో వారంలో మరోసారి ప్రత్యక్షంగా సమావేశం కావాలని నిర్ణయించారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా కాపులు అస్థిత్వం కోల్పోయేలా రాష్ట్రంలో పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని సమావేశంలో ఆందోళన వ్యక్తమమయింది. పార్టీలకు అతీతంగా ఒక వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గంటా శ్రీనివాసరావు, వట్టి వసంతకుమార్, బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఐఏఎస్ అధికారులు రామ్మోహన్, భాను, మాజీ ఐపీఎస్ సాంబశివరావులు హాజరయ్యారు.

# జీవో నెంబర్ 77 రద్దు చేయాలి

**పీజీ చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలి**

**ఏఐఎస్ఏ (ఐసా) డివిజన్ అధ్యక్షుడు పగుట్ల కుమార్ బాబు డిమాండ్**

నూజివీడు జనవరి 25, (న్యూస్ పల్స్) పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రీఎంబర్స్మెంట్ కొనసాగించాలని అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై నాలుగు వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని నూజివీడు కూరగాయల మార్కెట్ వద్ద ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) ఆధ్వర్యంలో చేపలు కూరగాయలు కొత్తిమీర అమ్ముతూ విద్యార్థులు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ (ఐసా) నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడు పగుట్ల కుమార్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 77 వల్ల డిగ్రీ పూర్తిచేసి పీజీ కోర్సులు చేద్దామన్నా విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయి ఫీజులు కట్టుకోలేక డిగ్రీతో ఆపేసి కూలి పనులు చేసుకుంటూ జీవితం సాగించాల్సిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది మరోపక్క ఉద్యోగ విరమణ వయసు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలు పంచడం వల్ల ఎన్నో సంవత్సరాలుగా కోచింగ్ తీసుకుని జాబులు కొట్టాలని ఎదురుచూస్తున్న విద్యార్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం దాదాపు మూడు సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం దుర్మార్గమని వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని లేనిపక్షంలో ఈ ఉద్యమం మరింత ఉధృతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు విద్యార్థులందరినీ వ్యక్తం చేస్తూ ఉద్యమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నూజివీడు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవీంద్ర బాబు, కాజా నవీన్, నాయకులు హుస్సేన్, ప్రవీణ్, పండు, జ్యోతి కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు

# కొడాలి తిట్లకు ఒక లెక్కుంది?!

అమరావతి జనవరి 25 తెలుగు రాష్ట్రాల రాజకీయాలు అంతకంతకూ దిగజారిపోతున్నాయన్న మాట తరచూ వినిపిస్తూ ఉంటుంది. గతం సంగతిని పక్కన పెడితే.. వర్తమానంలో మాత్రం ఈ పరిస్థితి చాలా దారుణంగా ఉందన్న మాట వినిపిస్తోంది.రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కొందరు నేతల నోటి నుంచి వచ్చే మాటలు మంట పుట్టించేలా ఉండటమే కాదు.. కనీస మర్యాద అన్నది లేకుండా రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించి ఎంత మాట పడితే అంత మాట అనేయటం కనిపిస్తుంది. తెలంగాణతో పోలిస్తే.. ఏపీకి చెందిన నేతలు రెండు ఆకులు ఎక్కువే తిన్నట్లుగా కనిపిస్తాయి వారి మాటల్ని చూస్తే.సంక్రాంతి సందర్భంగా గుడివాడలో నిర్వహించినట్లుగా ఆరోపణలు ఉన్న మంత్రి కొడాలి నానికి చెందిన కె కన్వెన్షన్ క్యాసినో ఎపిసోడ్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సంచలనంగా మారింది. ఈ ఎపిసోడ్ కు సంబంధించిన ఫోటోలు.. వీడియోలు ఇప్పటికే హల్ చల్ చేశాయి. అయితే.. అవన్నీ తప్పుడు వీడియోలుగా కొడాలి నాని కొట్టి పారేస్తున్నారు. కె కన్వెన్షన్ సెంటర్ కు నిజనిర్ధారణ కమిటీ అంటూ టీడీపీ అధినేత ప్రకటనపై కొడాలి నాని మరింతగా చెలరేగిపోయారు. బోలెడన్ని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వైనంపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతూ.. అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే.. కొడాలి నాని వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చేందుకు సోమవారం ఉదయం టీడీపీ నేత బుద్దా వెంకన్న ప్రెస్ మీట్ పెట్టిన వైనం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాటలు వైరల్ గా మారాయి. అన్నింటికి మించి.. షర్మిల ఏపీలో పార్టీ పెడితే మొదట ఆ పార్టీలో చేరేది మంత్రి కొడాలి నానినే అని.. అప్పుడు కూడా ఇప్పుడు చంద్రబాబును తిట్టినట్లే.. జగన్ ను తిట్టటం ఖాయమంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అనుకున్నట్లుగానే.. బుద్దా వెంకన్నను పోలీసులు అదుపులోకి తీసుకోవటం తెలిసిందే.ఇదిలా ఉంటే బుద్దా వెంకన్న చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొడాలి రియాక్టు అయ్యారు. ఆయన చేసిన ప్రతి వ్యాఖ్యకు కౌంటర్ ఇచ్చిన కొడాలి నాని.. ఎప్పటిలానే చెలరేగిపోయారు.

ఇన్ని మాటలు మాట్లాడిన కొడాలి.. బుద్దా వెంకన్న ప్రస్తావించిన షర్మిల పార్టీలో చేరే అంశానికి మాత్రం స్పందించకపోవటం గమనార్హం. ఇదంతా చూసినప్పుడు.. కొడాలి నాని విరుచుకుపడే వ్యాఖ్యల్లోనూ లెక్క ఉందని.. ఉత్తినే మాట్లాడటం లేదన్న విషయం అర్థమవుతుంది.తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టే కొడాలి మాటలన్నీ ఆవేశంతో చేసేవి కావని... తన అనుకున్నట్టు లెక్కగానే చేస్తున్నారంటున్నారు. ఒకవేళ కొడాలికి లెక్క తెలీకుంటే.. బుద్దా వెంకన్న ప్రస్తావించిన షర్మిల పార్టీ అంశంపైనా మాట్లాడేవారని.. అదేమీ మాట్లాడకుండా మిగిలిన విషయాల్ని మాత్రమే మాట్లాడారంటే.. తన విరుచుకుపడే మాటలన్ని లెక్కగానే ఆయన తిడుతున్నట్లుగా పరిగణలోకి తీసుకోవాలన్న మాట వినిపిస్తోంది.

# టెన్త్ టెన్షన్ తీరేదెలా...



వరంగల్, జనవరి 25, (న్యూస్ పల్స్)ఈ ఏడాదీ టెన్త్ టెన్షన్ పట్టుకుంది. ప్రస్తుత విద్యాసంవత్సరం ఆలస్యంగా ప్రారంభం కావడం వరుసగా దసరా, క్రిస్మస్ సెలవులు రావడం, అనంతరం నెల రోజుల పొడవునా ఉపాధ్యాయుల బదిలీల గొడవ, మొన్నటివరకు సంక్రాంతి సెలవులు.. థర్డ్‌వేవ్ పుణ్యమా అని వాటి పొడిగింపు.. పర్యవసానంగా ఈ ఏడాదీ పదోతరగతి చదువులు చట్టుబండలే అవుతోంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 50శాతం సెలబస్ కూడా పూర్తికాలేదు. ఆన్‌లైన్ పేరుతోనో.. అదనపు తరగతుల పేరుతో ప్రయివేటులో కనీసం 65 నుంచి 70శాతం వరకు సిలబస్ పూర్తయింది. ఏదేమైనా రెండేండ్లుగా ప్రభుత్వం టెన్త్ విద్యార్థులను పరీక్షలు రాయకున్నా.. పాస్ చేస్తున్న క్రమంలో ఈ ఏడాదీ థర్డ్‌వేవ్ నేపథ్యంలో కరోనా పాస్ అవుతామా? అన్న ఆందోళనలు విద్యార్థుల్లోనూ, అటు వారి తల్లిదండ్రుల్లో నెలకొంది.ఈ విద్యాసంవత్సరం సెప్టెంబర్‌లో ఆలస్యంగా తరగతులు ప్రారంభమయ్యాయి. మొదట్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా నమోదుకాగా అయినా పాఠాలు సాగాయి. ఈలోపు దసరా సెలవులు వచ్చాయి. సెలవుల అనంతరం గాడిన పడిందనుకున్న సమయంలోనే డిసెంబర్‌లో కొత్త జిల్లాలకు ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ షురూ అయింది. తమ పోస్టింగ్‌ల్లో అన్యాయం జరుగుతుందని ఆందోళన బాటపట్టడంతో ఈ నెలంతా టెన్త్‌సెలబస్ జోలికి పోలేదు. దాంతో ఏ ఒక్క సర్కారు బళ్లో కూడా సరిగ్గా పాఠాలు సాగలేదు. ఉపాధ్యాయుల అభ్యంతరాలు ముగిసి వారికి కేటాయింపులు పూర్తయ్యేనాటికి సంక్రాంతి పండుగ సెలవులు వచ్చాయి. అవి ఏకంగా 14 రోజులపైనే తొలుత ప్రకటించినా.. కరోనా థర్డ్‌వేవ్ ముంచుకొచ్చింది. ప్రభుత్వం పాఠశాలల మూత అని నేరుగా చెప్పకుండా ఈనెలాఖరు వరకు ప్రభుత్వం సెలవులు పొడిగించింది. నేటి నుంచి ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించిన సర్కారు ఇక భౌతిక తరగతులకు స్వస్తి పలకనున్నట్టు తెలుస్తోంది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,952 ప్రభుత్వ పాఠశాల ల్లో 2,89,573 మంది విద్యార్థులు చదువుతు న్నారు. అందులో పదో తరగతి విద్యార్థులు 29,950 మంది ఉన్నా రు. జిల్లాల వారీగా పరిశీలిస్తే జగిత్యాల జిల్లాలోని 1141 పాఠశాలల్లో 1,48,293 మంది విద్యార్థులు చదువు తుండ గా.. పదోతరగతి విద్యార్థులు 11,792 మంది ఉన్నారు. కరీంనగర్ జిల్లాలో 704 ప్రభుత్వ పాఠశాలల్లో 53,800 మంది విద్యార్థులుండగా.. వారిలో 8,217 మంది టెన్త్ స్టూడెంట్స్ ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలో576 ప్రభుత్వ పాఠ శాలల్లో 46,391 మందివిద్యార్థులుండగా పదోతరగతి విద్యార్థులు 3,593 మంది చదువుతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 531 సర్కారు బడుల్లో 41,089 మంది విద్యార్థులు చదువుతుండగా.. అందులో పదో తరగతి విద్యార్థులే 6,348మంది ఉన్నారు. ఇప్పుడు వీరంతాపదోతరగతి పరీ క్షలు జరుగుతాయో లేదోనన్న మీమాంసలో ఉన్నారు. దాని కితోడు సిలబస్ సైతం సగం కూడా పూర్తవలేదు. మరోవైపు నేటి నుంచి ప్రభుత్వం ఆన్ లైన్ తరగతులను ప్రారంభిం చింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో మెజార్టీ సంఖ్యకు కనీసం స్మార్ట్ ఫోన్లు లేవు. 2019 మార్చి నుంచి మొదలైన కరోనా వేవ్ మూడేండ్లుగా పట్టిపీడిస్తోంది. ఏడాది క్రితం వరకూ ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయిన బలహీనవర్గాల కుటుంబాల్లో పిల్లల చదువు మోయలేని భారంగా మారింది. ఇప్పుడిప్పుడే కోలు కుంటున్న దశలో మళ్లీ థర్డ్‌వేవ్ రావడం, ఆన్‌లైన్ తరగతులను ప్రభుత్వమే మొదలు పెట్టడం పర్యవసానంగా సర్కారు విద్యాసంస్థల్లోని పిల్లలు ఈ ఏడాది కూడా చదువుకు దూరం కానున్నారు.

# విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 26న విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలను ప్రభుత్వం నిర్వహించనుంది. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం జగన్ ఈ వేడుకలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. బెంజిసర్కిల్ వైపు నుంచి ఎంజీ రోడ్డు వైపు వచ్చే వాహనాలను బెంజి సర్కిల్, స్క్రూ బ్రిడ్జి, కృష్ణలంక జాతీయ రహదారి మీదుగా బస్ స్టేషన్ వైపు మళ్లిస్తారు. రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ కూడలి, శిఖామణి కూడలి నుంచి వెటర్నరీ కూడలి వైపు ఏ విధమైన వాహనాలను మళ్లించరు. బెంజిసర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు వీఐపీల వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

పాత కంట్రోల్ రూం నుంచి బెంజి సర్కిల్ వైపు వచ్చే అన్ని వాహనాలను రెండు మార్గాల్లో మళ్లించనున్నారు. ఆర్టీసీ వై జంక్షన్, కార్ల్ మార్క్స్ రోడ్డు, విజయా టాకీస్, చుట్టుగుంట, పడవల రేవు, రామవరప్పాడు మీదుగా మళ్లిస్తారు. అటు ఆర్టీసీ వై జంక్షన్, బందరు లాకులు, రాఘవయ్య పార్కు, కృష్ణలంక హైవే స్క్రూ బ్రిడ్జి మీదుగా వాహనాలను మళ్లిస్తారు.

# ఉద్యోగ సంఘాల భారీ ర్యాలీ

విజయవాడ రివర్స్ పిఆర్సి జీవోలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉద్యోగ సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఉద్యోగులపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో తాము అంతర్భాగమైన అన్న విషయాన్ని గుర్తు ఎరగాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అశుతోష్ మిశ్రా నివేదికను తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ సంఘాలు ఈరోజు నిరసన ర్యాలీ పిలుపునిచ్చాయి. వచ్చే నెల ఏడో తేదీ నుంచి సమ్మెకు దిగుతున్న నేపథ్యంలో ఐక్య కార్యాచరణ సమితి మంగళవారం విజయవాడలో నిరసన ర్యాలీ చేపట్టింది. పాత బస్టాండ్ నుంచి ధర్నా చౌక్ వరకు సాగిన ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై తమ నిరసన వ్యక్తం చేశారు. పాత పీఆర్సీని అమలు చేయాలని, కొంతమంది ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగుల జీతాలు తగ్గించడం ఏమిటంటూ వారు ప్రశ్నించారు. పనికి తగ్గ వేతనం ని మాత్రమే తాము తీసుకుంటున్నామని, సోషల్ మీడియా ఇతర మార్గాల ద్వారా ఉద్యోగులను కించపరిచే రీతిలో ప్రచారం చేయడం బాధాకరమని నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగులే ముందు ఉన్నారన్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలని, చీకటి జీవోలను రద్దు చేసి పాత పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఈచర్ లారీ సహా 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**ఆరు గురు స్మగ్లర్లు అరెస్టు**

తిరుపతి భాకరాపేట సెక్షన్ చిన్నగొట్టి గల్లు మండలం పరిధిలో లారీలో లోడ్ చేస్తున్న తొమ్మిది ఎర్రచందనం దుంగలతో పాటు,ఒక ఈచర్ లారీని టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తున్న ఆరుగురు స్మగ్లర్లు ను అరెస్ట్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఆయన మంగళవారం టాస్క్ ఫోర్స్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ ఎస్పీ మేడా సుందరరావు ఆదేశాల మేరకు ఆర్ ఎస్ ఐ లు కేఎస్ కె లింగాధర్, కె.సురేష్ బాబు టీమ్ సోమవారం నుంచి భాకరాపేట ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారని చెప్పారు. మంగళవారం ఉదయం తిరుపతి భాకరాపేట రోడ్డు మార్గంలో చిన్నగొట్టి గల్లు మండలం చామల రేంజిలో కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను లారీ లో లోడ్ చేస్తుండగా టాస్క్ ఫోర్స్ కంట పడునట్లు తెలిపారు. దీంతో వారిని చుట్టుముట్టిన టాస్క్ ఫోర్స్ స్మగ్లర్ల ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలు, మూడు గొడ్డళ్లు, లారీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి మొత్తం విలువ 30 లక్షల రూపాయలు ఉంటుందని చెప్పారు. అరెస్టు అయిన స్మగ్లర్లు లో తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు కు చెందిన రమేష్ (28), దొరైస్వామి (35), కుమారస్వామి (30), పొన్ను స్వామి (56), ఆనందన్ (21), మది అలగన్ (20) ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును సి ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిఐలు వెంకట్ రవి, చంద్రశేఖర్, ఆర్ ఐ (ఏ ఆర్) సురేష్ కుమార్ రెడ్డి, ఎఫ్ ఆర్ ఓ ప్రసాద్,ఎస్ ఐ మోహన్ నాయక్, ఆర్ ఎస్ ఐ లు లింగాధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాపై ప్రశ్నించిన వ్యక్తి పై దాడి

బెల్లంపల్లి జనవరి 25 :తన భూమినీ ఎందుకు కబ్జా చేస్తున్నావని ప్రశ్నించినందుకు భూ యజమాని ని కౌన్సిలర్ అతని అనుచరులు కర్రలతో దాడి చేసిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే బెల్లంపల్లి మండలం 13వ వార్డు పరిధిలో గుంపుల రఘురాం అనే సింగరేణి కార్మికుడికి 20 గుంటల భూమి ఉంది, అతని భూమి పక్కనే కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఓబీసి సెల్ ఉపాధ్యక్షుడు బెల్లంపల్లి 13 వ వార్డు కౌన్సిలర్ బండి ప్రభాకర్ కన్ను పడింది, గతంలోనే రఘురాం స్థలం కొంత భూమి కబ్జా చేసిన కౌన్సిలర్ బండి ప్రభాకర్, ఖాళీగా ఉన్న

మిగతా భూమిపై కన్నేసి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడు విషయం తెలుసుకున్న భూ యజమాని గుంపుల రఘు రాం తన భూమి వద్దకు వెళ్ళి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించుకునేందుకు ప్రణాళిక చేస్తుండగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నేత కౌన్సిలర్ బండి ప్రభాకర్ అతని అనుచరులు నానా భూతులు తిడుతూ రఘురాం పై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసి చితక బాదారు, గాయాల పాలైన రఘు రాం తప్పించుకుని పోలీస్ స్టేషన్ కు వెళ్ళి పిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తనభూమి తనకు ఇప్పించాలని, కౌన్సిలర్ నుండి ప్రాణహని ఉందని అతని నుండి రక్షణ కల్పించాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు..

# చిన్న చేపలు మింగడానికి....

## పెద్ద తిమింగలాలు వచ్చాయి...

నందికొట్కూర్ జనవరి 25, ( విభారె) శ్రీశైలం బ్యాక్ వాటర్ లో గత కొన్ని రోజుల క్రితం నుండి చిన్న చేపలను మింగడానికి... పెద్ద తిమింగలాలు వచ్చాయి అని సాలు వలలు వేసే చేపల వేటగాళ్లు బాధపడుతున్నారు. నిజంగా చెప్పాలంటే శ్రీశైలం బ్యాక్ వాటర్ లో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ మత్స్యశాఖ జిల్లా అధికారులు. మరియు మత్స్యశాఖ నందికొట్కూరు నియోజకవర్గ అ అధికారులు. అదే విధముగా పగిడాల మండలంలోని వివిధ గ్రామ పంచాయతి లో ఉన్నటువంటి గ్రామ చేపల అధికారులు. జె డి ఎ మరియు ఎఫ్ డి శాసనసభ్యులు ఆర్థర్ సమక్షంలో నెహ్రూ నగర్ గ్రామం లోని మూర్వకొండ బోటు ఘాట్ వద్ద దాదాపుగా సుమారు ఏడు లక్షల చేప పిల్లలను వదలడం జరిగిందని .. ఈరోజు ముఖ్యంగా చెప్పాలంటే మంగళవారం నాడు సిపిఎం నాయకులు పి.పకీర్ సాహెబ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్ లో చిన్న చేపలు పెద్దవై ఒక చేప 10 కేజీలు నుండి 10 కేజీల 15 వరకు పెద్దవై లైసెన్స్ ఉన్నటువంటి సాలు చేపలా వెట గాళ్లకు న్యాయం జరుగుతుంది.అనే స్వభావంతో చేప పిల్లలను నందికొట్కూరు ఎమ్మెల్యే విడుదల చేశారు.. కానీ ఇప్పుడు శ్రీశైలం బ్యాక్ వాటర్ లో చిన్న చేపలు పట్టేందుకు పెద్ద తిమింగలాలు ప్రతి గ్రామం నింపి ముంపు పరివాహక శ్రీశైలం బ్యాక్ వాటర్ ఓడ్డూ వెంబడి చేపల వేట కొనసాగిస్తున్న సాలు వలల లైసెన్స్ ఉన్న చేపల వేటగాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని. శ్రీశైలం బ్యాక్ వాటర్ లో అలివి వలలు ఎప్పటికీ వాడకూడదు అనే స్వభావంతో మత్స్యశాఖ జిల్లా అధికారుల నుండి గ్రామ అధికారుల వరకు చెప్పడం గమనార్హం.... గత కొన్ని రోజుల నుండి శ్రీశైలం బ్యాక్ వాటర్ లో గ్రామానికి ఒక పెద్ద మనిషిలా చలామణి అవుతూ చిన్న చేపలు పట్టి పెద్ద వ్యాపారం చేసుకుంటున్నా కూడ మత్స్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో తేలియాడుతూ. సాలు వలల చేపల వేటగాళ్లు జరుగుతుందని బాధపడ్డరు. ముఖ్యంగా చెప్పాలంటే మల్యాల. శాతనకొట. బిజినవేముల. సంకిరేణీ పల్లె. ఎమ్. ఎన్ గణపురం. నీటీ పరిసరాల్లోని శ్రీశైలం బ్యాక్ వాటర్ లో చిన్న చేపల వేట కొనసాగుతుందని వారు మండిపడుతున్నారు.. మత్స్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో వుగూలడుతూ.. నీటి పరివాహక ప్రాంతం నుండి చిన్న ఒట్టి చేపలు వాహనాల్లో తరలిస్తున్న కూడా మాకు ఏమి తెలియదు అనే రీతిలోవ్యవహరించడం చాలా బాధాకర విషయం అని సాలు వల చెపల వేటగాళ్లు వారు వారి బాధ తెలియజేశారని.. చేపల వేట వాళ్లు వాళ్లు మేము గత కొన్ని సంవత్సరాల నుండి తాత ముత్తాల కాలం నుండి కూడా బేస్తవారిగా చేపల వేట చేసుకుంటున్నాము. వేసవి కాలం వస్తే చాలు వైజాగ్. కొవ్వూరు. విశాఖపట్టణం. కోదాడ. అనంతపురం చెప్పుకుంటూ పోతే చాలా ప్రాంతం నుండి కూడా పని చేసుకునేందుకు అలివలలు లాగేందుకు కూలీలు రావడం జరుగుతుంది. జనవరి నుండి ఏప్రిల్ చివరి దాకా సాలు వలల చేపల వేట చేసుకొని భార్య పిల్లలు బతికించు కోవచ్చని అప్పు చేసి సాలువాలలు తేచ్చుకోవడం జరిగింది. చిన్న చేపలు పట్టే పెద్ద వేటగాళ్లు మా వేటను కొనసాగించకుండా అడ్డుకోవడం జరుగుతుందని బాధపడటం బాధాకరమైన విషయం.. మత్స్య శాఖ ఉన్నతాధికారులు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా బాజాభజంత్రీలు. పూల తోరణాలు మధ్య మన నందికొట్కూరు శాసనసభ్యులు ఆధ్వర్యంలో చేపపిల్లలను వదిలారు.. మలి రోజు నుండే మా దారి రహదారి... మి దారి ఎడారి అన్న చందంగా... స్వార్థ ప్రయోజనం కోసం. సొంత గ్రామాల జాలరి వాళ్ళు కానీ. చిన్న పెద్ద వ్యాపారస్తులు కానీ ఇలాంటి అభివృద్ధి నోచుకోవడంలేదు... అంతా దేవుని మహిమ అన్న చందంగా చిన్న చేపలను పెద్ద సొమ్ముగా తరలించుకొని వెళుతున్నారు.. మా బాధ చూస్తే చాప కింద నీరులా ఊరికి పరిమితమై కాలం వెల్లదీస్తున్న మని వారు అంటున్నారు.. ఇప్పటికైనా నిరుపేదలు అయినటువంటి బెస్తవారి సాధక బాధలను గుర్తించి గ్రామాన్ని నమ్ముకుని బతుకుతున్నా. జాలరి వాళ్లను మత్స్యశాఖ జిల్లా ఉన్నతాధికారులు. నందికొట్కూరు. గ్రామ అధికారులు మా సమస్యను ఇస్తారా...లేదా వదిలేస్తారా... వేచి చూద్దాం..... అని సిపిఎం నాయకులు నాయకులు పక్కిర్ సాహెబ్ వివరించారు రు..ఈ సందర్భంగా మత్స్యశాఖ జిల్లా అధికారి నందికొట్కూరు ప్రాంతానికీ చెందిన చేపల అధికారికి వివరణ కోరగా మాకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే వారు చెప్పిన చోటికి వెళ్లి తనిఖీ చేస్తామని మాకు సమాచారం లేకుండా ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా కూడా మాకు సంబంధం లేదని వారు వివరణ ఇవ్వడం జరిగింది...

# ఓటు పౌరుని ప్రాథమిక హక్కు...

## తహసిల్దార్ నజ్మా భాను

తుగ్గలి నేటి సమాజంలో ఓటు హక్కు చాలా విలువైనదని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తుగ్గలి తహసిల్దార్ నజ్మా భాను తెలియజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం రోజున స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఓటర్ల ప్రతిజ్ఞను నిర్వహించారు. అదేవిధంగా జొన్నగిరి సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి మరియు వీఆర్వో వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ల ప్రతిజ్ఞ ను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో క్రొత్తగా పేరు నమోదు చేసుకొనుటకు మీ వార్డు పరిధిలోని బూత్ స్థాయి అధికారిని వద్ద గాని,తహశీల్దారు కార్యాలయములో గాని,ఓటరు రిజిస్ట్రేషనుఅధికారి కార్యాలయములో లేదా మీ సేవా కేంద్రాల ద్వారా ఫారము 6 ను పూరించి సరైన నఖలు జతచేసి సమర్పించాలని వారు తెలియజేశారు.ఫారము-6 క్రొత్తగా పేరు నమోదు చేసుకొనుటకు,ఫారము -7 ఓటరు జాబితాలో పేరును తొలగించమని అభ్యంతరము తెలుపుటకు,ఫారము - 6ఎ విదేశాలలో నివాసం ఉంటున్న భారతీయ పౌరులు ఓటరుగా నమోదు చేసుకొనుట గురించి,ఫారము - 8ఎ ఓటరు జాబితాలో పేరును ఒకే నియోజయవర్గంలో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి బదిలి చేసుకొనుట కొరకు,ఫాగము-8 ఓటరు జాబితాలో పేరు వయస్సు, చిరునామాలు తప్పులు సరిచేయమని కోరుట గురించి వినియోగించుకోవాలని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ విజయ్ కుమార్,జూనియర్ అసిస్టెంట్ రంగస్వామి,సచివాలయ ఉద్యోగులు,గ్రామ వాలంటీర్లు,వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసవ సమయంలో వెన్నుఎముకకు ఎందుకు అనస్థీషియా ఇవ్వాలి? దీని వల్ల ప్రయోజనం ఏమిటి?



స్త్రీలకు ప్రసవం సంతోషం కంటే బాధాకరమే. అయినా కూడా సామాన్యుడికి అందని పరిస్థితి. అయితే అప్పటిలా అవన్నీ లేకుండా ఇప్పుడు వైద్యరంగం చాలా అభివృద్ధి చెందింది. స్త్రీలలో, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఎపిడ్యూరల్ మత్తుమందు వెన్నుఎముకలోకి ఇంజెక్ట్ చేయబడుతుంది. ప్రసవ సమయంలో మహిళలు మరింత తేలికగా ఉండటానికి ఈ మత్తుమందు సహాయపడుతుంది. ఇది గర్భిణీ స్త్రీ యొక్క వెన్నుఎముకలోకి ఇంజెక్ట్ చేయబడుతుంది మరియు ఆ ప్రాంతాన్ని తిమ్మిరి చేస్తుంది. దీంతో మహిళలు ప్రసవ వేదనను అనుభవించలేరు. కానీ ఈ డెలివరీ పద్ధతిని ఎంచుకునే ముందు మీరు పరిగణించవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి. సుఖ ప్రసవం సుఖ ప్రసవం చాలామంది మహిళలు సురక్షితమైన ప్రసవాన్ని కోరుకుంటారు. కానీ చాలా మంది మహిళలు ప్రసవ వేదన భరించలేరు. ప్రసవం ఎలా జరిగినా ఒకటే ప్రసవం. గర్భాశయం సంకోచం మరియు వ్యాకోచం మరియు నొప్పిని కలిగిస్తే మంచిది. ఇది మీకు బిడ్డ పుట్టడాన్ని సులభతరం చేస్తుంది. చాలా మంది స్త్రీలకు ప్రసవం అంటే టాక్సోఫోబియా భయం ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి భయాన్ని విడిచిపెట్టి ప్రసవాన్ని ఎదుర్కోండి. మీకు కష్టమైన డెలివరీ ఉంటే మీరు ఈ ఎపిడ్యూరల్ మత్తుమందును ఎంచుకోవచ్చు. ఇందులో తప్పేమీ లేదని వైద్యులు చెబుతున్నారు. మీరు గర్భవతి కావాలనుకుంటే పరిగణించవలసిన అంశాలు ఇక్కడ ఉన్నాయిమీరు గర్భవతి కావాలనుకుంటే పరిగణించవలసిన అంశాలు ఇక్కడ ఉన్నాయి ఎపిడ్యూరల్ పద్ధతి యొక్క ప్రయోజనాలు మరియు అప్రయోజనాలు ఎపిడ్యూరల్ పద్ధతి యొక్క ప్రయోజనాలు మరియు అప్రయోజనాలు ఈ పద్ధతికి కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. దీని గురించి మీ వైద్యునితో మాట్లాడండి. బెంగుళూరులోని మెటర్నిటీ హాస్పిటల్స్‌లో అనస్థీషియాలజిస్ట్ మరియు కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ మన్సూర్ ప్రకారం, ఈ ఎపిడ్యూరల్ డ్రగ్ మహిళల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం మరియు శరీర ఉష్ణోగ్రతలో మార్పులు వంటి దుష్ప్రభావాలను కలిగిస్తుంది. అదే సమయంలో దీని ప్రయోజనం ఏమిటంటే ఇది మీ బిడ్డను ఏ విధంగానూ ప్రభావితం చేయదు. ప్రసవ నొప్పిని తగ్గిస్తుంది మరియు రిలాక్స్ మూడ్ ఇస్తుంది. స్త్రీలకు ప్రసవం సులభతరం చేస్తుంది. శిశువును బహిష్కరించడంలో సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. మహిళలు మూర్ఛపోకుండా ప్రసవాన్ని కూడా చూడవచ్చు. గర్భధారణ సమయంలో మధుమేహం వల్ల కలిగే దుష్ప్రభావాలు మీకు తెలుసా?గర్భధారణ సమయంలో మధుమేహం వల్ల కలిగే దుష్ప్రభావాలు మీకు తెలుసా? తగిన ఆసుపత్రిని ఎంచుకోవడం తగిన ఆసుపత్రిని ఎంచుకోవడం ప్రసవ సమయంలో సరైన ఆసుపత్రిని ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది మీ ఉత్తమ ఆసక్తి మరియు మీ పిల్లల శ్రేయస్సు. కాబట్టి మీ స్నేహితులతో అందరినీ సంప్రదించి తగిన ఆసుపత్రిని ఎంచుకోండి. ఎపిడ్యూరల్ థెరపీ సమయంలో, మీ పిండం యొక్క హృదయ స్పందన రేటు మరియు రక్తపోటును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. ఎందుకంటే రక్తపోటు తగ్గే అవకాశం ఉంది. ఆసుపత్రి సిబ్బంది ప్రతి 5 నుండి 10 నిమిషాలకు ఈ పర్యవేక్షణ చేయాలి. కాబట్టి ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలివిగా ఆసుపత్రిని ఎంచుకోండి. గర్భధారణ పరీక్ష గురించి మహిళలు తెలుసుకోవలసిన విషయాలుగర్భధారణ పరీక్ష గురించి మహిళలు తెలుసుకోవలసిన విషయాలు మీకు ఎపిడ్యూరల్ అవసరమా? మీకు ఎపిడ్యూరల్ అవసరమా? ప్రసవానంతర మహిళలందరికీ ఎపిడ్యూరల్ అనస్థీషియా అవసరం లేదు. మీరు ప్రసవ నొప్పులను ఎదుర్కోగలిగితే ఇది అవసరం లేదు. వెన్నునొప్పి మరియు తక్కువ రక్తపోటు ఉన్న మహిళలకు, ఎపిడ్యూరల్స్ జీవనాధారం కావచ్చు. కాబట్టి వారు దీనికి దూరంగా ఉండటం మంచిది. బ్లడ్ థిన్నర్స్ మరియు థిన్నర్స్ తీసుకునే మహిళలు ఎపిడ్యూరల్స్ ఉపయోగించకూడదు. ఎందుకంటే ప్రసవ సమయంలో రక్తం గడ్డకట్టే అవకాశం ఉంది. ఇలాంటి రక్త సమస్యలున్న మహిళలు ఈ ఎపిడ్యూరల్ తీసుకోకూడదని డాక్టర్ పండిత సిన్హా అంటున్నారు. ఎపిడ్యూరల్ ఎప్పుడు డెలివరీ చేయబడుతుంది? ఎపిడ్యూరల్ ఎప్పుడు డెలివరీ చేయబడుతుంది? ఇది ప్రసవ ప్రారంభంలో ఇవ్వదు. డెలివరీ ప్రారంభమైన తర్వాత ఇవ్వబడుతుంది. 4 లేదా 5 సెంటీమీటర్ల వ్యవధిలో సాధారణ లేబర్ లక్షణాలు ఉంటే మాత్రమే ఈ ఔషధం ఇవ్వబడుతుంది. లేకపోతే వారు చెల్లించరు. మందు కలపడానికి సమయం పడుతుంది. సూది వాలుగా ఉన్న స్థితిలో లేదా కూర్చున్న స్థితిలో ఉంచబడుతుంది. మందు కాథెటర్ ద్వారా ఇంజెక్ట్ చేయబడుతుంది. అప్పటి వరకు మహిళలు కొద్దిగా నొప్పిని భరించవలసి ఉంటుంది. కాబట్టి బాధను భరించేందుకు మానసికంగా మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. గర్భిణీ స్త్రీ యొక్క సమ్మతి పొందబడుతుంది

# రెండు మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల రైట్స్ దక్కించుకున్న దిగ్గజ ఓటీటీ..!


ఓటీటీల హవా మొదలయ్యాక వీక్షకులను ఆకట్టుకోవడానికి స్ట్రీమింగ్ దిగ్గజాలు సరికొత్త ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. సబ్ స్క్రైబర్స్ ను పెంచుకోవడానికి ఎప్పటికప్పుడు ఫ్రెష్ కంటెంట్ ను అందించే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వాటిలో ప్రముఖ డిజిటల్ ఫ్లాట్ ఫార్మ్ 'జీ5' కూడా ఒకటి.తెలుగు ప్రేక్షకులను అలరించడానికి జీ 5 సంస్థ.. సరికొత్త సినిమాలు - ఒరిజినల్ వెబ్ సిరీస్ లతోపాటుగా డైరెక్ట్ ఓటీటీ రిలీజులను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ క్రమంలో సొంతంగా నిర్మించే సినిమాలతో పాటుగా పలు క్రేజీ మూవీస్ ని కొనుగోలు చేస్తోంది. జీ5 ఓటీటీ ని సౌత్ లో బలోపేతం చేసేందుకు భారీగా ఖర్చు చేస్తోందని టాక్.యావత్ సినీ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్న 'ఆర్.ఆర్.ఆర్' సినిమా డిజిటల్ రైట్స్ ఇప్పుడు జీ గ్రూప్ వద్దే ఉన్నాయి. ఈ మూవీ తెలుగు తమిళం మలయాళం కన్నడ భాషలకి చెందిన డిజిటల్ హక్కులను దక్కించుకుంది జీ5. దీని కోసం భారీ ధర చెల్లించినట్లు తెలుస్తోంది.




అయితే ఇప్పుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ - షో మ్యాన్ శంకర్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'ఖీఅ15' సినిమాకు సంబంధించిన స్ట్రీమింగ్ హక్కులకు కూడా జీ స్టూడియోస్ వారు చేజిక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇతర సంస్థలతో పోటీపడి మరీ ఫ్యాన్సీ రేటుకు ఈ రైట్స్ తీసుకున్నారని తెలుస్తోంది.శంకర్ - చరణ్ వంటి అరుదైన కాంబోలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న ఖీఅ15 పై అంచనాలు భారీగా ఉన్నాయి. దీంతో ఈ సినిమా నిర్మాణంలో జీ స్టూడియోస్ కూడా భాగమైంది. ఇందుకు గాను ఈ సినిమాకి సంబంధించిన అన్ని భాషల శాటిలైట్ మరియు డిజిటల్ రైట్స్ ని సొంతం చేసుకోనున్నారని సమాచారం.దిల్ రాజు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ నాన్-థియేట్రికల్ రైట్స్ అన్నిటిని జీ స్టూడియోస్ కి ఇచ్చేసి.. అన్ని భాషల థియేట్రికల్ హక్కులను మాత్రం తన దగ్గరే ఉంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. రామ్ చరణ్ - శంకర్ ల సినిమా 2023 సంక్రాంతికి విడుదల కానుంది. ఈ క్రమంలో జీ5 ఓటీటీలోకి రానుంది.గతంలో చెర్రీ హీరోగా నటించిన 'బ్రూస్లీ' సినిమా రైట్స్ జీ గ్రూప్ వద్దే ఉండగా.. ఇప్పుడు 'ఆర్.ఆర్.ఆర్' 'ఖీఇ15' వంటి రెండు బ్యాక్ టూ బ్యాక్ పాన్ ఇండియా చిత్రాల హక్కులను కైవసం చేసుకోవడం గమనార్హం. ఈ రెండు ప్రతిష్టాత్మక సినిమాలు ఓటీటీ జీ స్టూడియోస్ కు మరింత ప్రత్యేకతను తీసుకొస్తాయని భావించవచ్చు.

# 'అల..' హిందీ రిలీజ్కి మరో ట్విస్ట్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన తొలి పాన్ ఇండియా మూవీ 'పుష్ప ది రైజ్'. సుకుమార్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం వరల్డ్ వైడ్ గా భారీ క్రేజ్ ని సొంతం చేసుకోవడమే కాకుండా వసూళ్ల పరంగానూ సరికొత్త రికార్డుల్ని తిరగరాస్తోంది. రష్మిక మందన్న నటించిన ఈ చిత్రం తెలుగు తమిళ మలయాళ కన్నడ భాషలకు మించి బాలీవుడ్ లో మరీ ముఖ్యంగా ఉత్తరాదిలో భారీ వసూళ్లని రాబట్టడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారిన విషయం తెలిసిందే. ఈ మూవీతో బన్నీ పాన్ ఇండియా స్టార్ గా మారిపోయారు. దీంతో ఆయన క్రేజ్ ని క్యాష్ చేసుకోవాలని గోల్డ్ మైన్స్ టెలీఫిల్మ్స్ అధినేత మనీష్ షా ప్లాన్ చేశాడు. ఆలోచన వచ్చిందే అదనుగా అల్లు అర్జున్ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ 'అల వైకుంఠపురములో' హిందీ డబ్బింగ్ రైట్స్ ని సొంతం చేసుకున్నాడు. ఈ చిత్రాన్ని జనవరి 26న దేశ వ్యాప్తంగా హిందీ డబ్బింగ్ వెర్షన్ ని థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్టుగా ఓ పోస్టర్ ని కూడా విడుదల చేశాడు. దీంతో ఈ చిత్రాన్ని 'షెహజాదా' పేరుతో రీమేక్ చేస్తున్న వారు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. హిందీ డబ్బింగ్ వెర్షన్ రిలీజ్ చేస్తే మా పరిస్థితి ఏంటని రంగంలోకి దిగారు. వెంటనే అల్లు అరవింద్ ని లైన్ లోకి తీసుకొచ్చి సదరు డబ్బింగ్ వెర్షన్ రిలీజ్ ని నిలిపి వేసేలా చ ర్యలు తీసుకున్నారు. దీంతో గోల్డ్ మైన్స్ టెలీఫిల్మ్స్ అధినేత మనీష్ షా ఈ చిత్ర విడుదలని నిలిపి వేస్తున్నట్టుగా ప్రకటించారు. దీంతో వివాదం సమసిపోయింది అని అంతా ఊపరి పీల్చుకున్నారు.ఇదిలా వుంటే గోల్డ్ మైన్స్ టెలీఫిల్మ్స్ అధినేత మనీష్ షా శనివారం 'షెహజాదా' టీమ్ కి మరో షాకిచ్చారు. ఈ చిత్రాన్ని హిందీ డబ్బింగ్ వెర్షన్ థియేటర్లలో రిలీజ్ చేయడం లేదని తెలిపిన ఆయన తన సొంత టీవీ ఛానల్ దించక్ టీవీలో మాత్రం ఫిబ్రవరి 6న ఈ చిత్ర హిందీ వెర్షన్ ని ప్రీమియర్ చేస్తున్నట్టుగా ప్రకటించారు.




# శ్రీవల్లి స్టెప్ ఇప్పుడు ఇలా కూడా వాడేస్తున్నారు

అల్లు అర్జున్.. సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. వసూళ్ల విషయంలో 2021 లో విడుదల అయిన ఇండియన్ సినిమాల్లో నెం.1 గా నిలిచింది. కేవలం కలెక్షన్స్ మాత్రమే కాకుండా భారీ ఎత్తున సోషల్ మీడియాలో ట్రెండ్ కూడా అవుతుంది.ఈ సినిమాలోని ప్రతి పాట కూడా నెట్టింట ఏదో ఒక రకంగా హల్ చల్ చేస్తూనే ఉంది. ముఖ్యంగా షార్ట్ వీడియోల కోసం పుష్ప పాటలు మారు మ్రోగుతున్నాయి. క్రికెటర్స్ మొదలుకుని సినిమా స్టార్స్ వరకు ఎంతో మంది బన్నీ వేసిన శ్రీవల్లి చెప్పు వదిలే స్టెప్పు వేశారు. కొన్ని లక్షల మంది ఆ స్టెప్పును ట్రై చేశారు. చెప్పు వదిలేసి చేసే ఆ స్టెప్ప్ చాలా మందికి నచ్చింది. చాలా విభిన్నంగా అనిపించిన ఆ స్టెప్ నెలలు గడుస్తున్నా కూడా ట్రెండ్ అవుతూనే ఉంది.తాజాగా ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. పుష్ప శ్రీవల్లి పాట కు ఒక చిన్నారిని ఎత్తుకుని వేసిన స్టెప్ కు పిదా అవుతున్నారు. పాప ఏడ్చిన సమయంలో శ్రీవల్లి స్టెప్ వేస్తే ఊరుకుంటుంది అంటూ ఒక నార్త్ ఇండియన్ వేసిన స్టెప్ వైరల్ అయ్యింది. శ్రీవల్లి పాట కేవలం తెలుగు లో మాత్రమే కాకుండా మొత్తం అన్ని భాషల్లో కూడా ఇంకా ట్రెండ్ అవుతూనే ఉంది. సోషల్ మీడియాలో ఈ పాట స్టెప్పులు లక్షల కొద్ది వస్తూనే ఉన్నాయి.






తాజాగా టీం ఇండియా స్టార్ క్రికెటర్ కూడా శ్రీవల్లి స్టెప్ వేశాడు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం మారు మ్రోగిపోవడం తో పాటు దేశ వ్యాప్తంగా ఆయన పాటలు ఒక రేంజ్ లో ఊపేస్తున్నాయి. అన్ని భాషలకు తగ్గట్లుగా సింగర్స్ తో పాడించడం లో దేవి శ్రీ ప్రసాద్ సక్సెస్ అయ్యాడు. అందుకే ఈ పాట ఇంతటి విజయాన్ని సొంతం చేసుకుంది అనడంలో సందేహం లేదు.పుష్ప సినిమా లో అల్లు అర్జున్ కు జోడీగా రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించిన విషయం తెల్సిందే. ఐటెం సాంగ్ ను సమంత చేయగా ఆ పాట ఏ స్థాయి లో సక్సెస్ అయ్యిందో తెల్సిందే. సుకుమార్ పుష్ప పార్ట్ 1 తో ఏకంగా 300 కోట్ల కు పైగా వసూళ్లను దక్కించుకుని రెండవ పార్ట్ పై అంచనాలు భారీగా పెంచేశాడు. రికార్డు బ్రేకింగ్ వసూళ్లు దక్కించుకుని నాన్ బాహుబలి రికార్డును దక్కించుకున్న పుష్ప పార్ట్ 1 కి ఇప్పటికే పార్ట్ 2 వర్క్ షురూ అయ్యింది. వచ్చే నెలలో చిత్రీకరణ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. కాని కరోనా థర్డ్ వేవ్ వల్ల షూటింగ్ ఆలస్యం అయ్యేలా ఉంది. పుష్ప సోషల్ మీడియా సెన్సేషన్ మరో రెండు మూడు నెలల పాటు కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు పుష్ప సినిమాలోని పాటలు అన్ని కలిసి బిలియన్ వ్యూస్ ను కేవలం యూట్యూబ్ లోనే దక్కించుకున్నాయి.

# అదే నా ప్లాన్.. ఆల్‌రౌండర్‌గానే... పెద్దగా హడావుడి లేదు.. కెప్టెన్‌గా నా పాలసీ అదే: హార్దిక్ పాండ్యా




హార్దిక్ పాండ్యా.. ఒకప్పుడు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్‌గా క్రేజ్ సంపాదించుకున్న ఈ ఆటగాడు గత కొన్ని రోజులుగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. ఐపీఎల్-2021, టీ20 ప్రపంచకప్-2021 టోర్నీలో పేలవ ప్రదర్శన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. గాయాల బెడదతో సతమతమవుతున్న అతడు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. అయితే, ఇప్పటికే జాతీయ జట్టులో హార్దిక్ స్థానాన్ని భర్తీ చేసేందుకు యువ ఆటగాడు వెంకటేశ్ అయ్యర్ సిద్ధంగా ఉన్నాడు.మరోవైపు శార్దూల్ ఠాకూర్, దీపక్ చహర్ కూడా ఆల్‌రౌండ్ ప్రతిభతో అదరగొడుతున్నారు. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులో చోటు సంపాదించుకోవడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, తాను ప్రతిభను నిరూపించుకుని ఆల్‌రౌండర్‌గానే ఆడాలనుకుంటున్నానని, త్వరలోనే తిరిగి వస్తానని హార్దిక్ పాండ్యా ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా ఐపీఎల్ మెగా వేలం-2022 నేపథ్యంలో ముంబై ఇండియన్స్ హార్దిక్ పాండ్యాను వదిలేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో కొత్త ఫ్రాంఛైజీ అహ్మదాబాద్ అతడిని ఎంపిక చేసుకుంది. కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే హార్దిక్‌కు కాస్త ఊరట కలిగించే అంశం. ఈ నేపథ్యంలో జర్నలిస్టు బోరియా మజుందార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హార్దిక్ పాండ్యా తన గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "నేను ఆల్‌రౌండర్‌గానే ఆడాలనుకుంటున్నాను. గడ్డు పరిస్థితులు ఎదురుకావచ్చు.కానీ... ఆల్‌రౌండర్‌గా ఉండేందుకు అన్ని విధాలుగా సన్నద్ధమవుతున్నా. నా ప్లాన్ అదే. ప్రస్తుతం నేను బాగానే ఉన్నాను. దృఢంగా ఉన్నాను. అయితే, ఏం జరుగుతుందో కాలమే నిర్ణయిస్తుంది. ఇక కెప్టెన్సీ విషయానికొస్తే.... ఒక జట్టు ఎలా ఉంటే మంచి ఫలితాలు రాబట్టగలదో నా నాయకత్వం అలాంటి సంస్కృతిని పెంపొందించగలగాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**